పిల్లలూ.. అమ్మానాన్నకు చెప్పండి !



పొదలకూరు : ప్రభగిరిపట్నంలో ప్రచారంలో భాగంగా పిల్లలతో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి

చిన్నా ఇదే మన గుర్తు!



కలిగిరిలో చిన్నారులకు సైకిల్ చూపిస్తూ పెద్దలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి ప్రవీణ - కలిగిరి

హై.. హై



కావలి : చౌదరిపాలెంలో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఎడ్లబండిపై ప్రచారం నిర్వహించారు. వ్యవసాయాధారిత గ్రామం కావడంతో ఈ వినూత్న ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు.

తాతా బాగున్నావా!?



వలేటివారిపాలెం మండలం చుండి గ్రామంలో వృద్ధుడితో మాట్లాడుతున్న కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సాజన్య

పచ్చబొట్టుగా అభిమాన నేత





నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ ఫొటోను చేతిపై పచ్చబొట్టుగా వేయించుకున్న 4వ డివిజన్‌లోని జాకీర్‌హుస్సేన్ నగర్ కార్యకర్త మణికుమార్‌రెడ్డి

ఇప్పుడే ఇలా.. 13న ఎలా!?

- పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో గందరగోళం
- ఓటింగ్ వివరాల వెల్లడిలో తీవ్రజాప్యం
- అర్ధరాత్రికి కూడా రాని పోలింగ్ శాతం
- అధికారుల తీరు మారకుంటే ఇబ్బందులు తప్పవు !

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల విధుల్లో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. అయితే ఎంత మంది ఆ రోజు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారన్న వివరాలు వెల్లడించడంలో అధికారుల నుంచి తీవ్ర జాప్యం జరుగుతోంది. సాయంత్రం పోలింగ్ ముగిసినా అర్ధరాత్రి వరకు పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడి కావడం లేదు. తొలిరోజు ఆదివారం పోలింగ్ వివరాలను మరుసటి రోజు ఉదయాన ప్రకటించడం గమనార్హం. కీలకమైన పోలింగ్ ప్రక్రియ మొదలైనప్పుడు ఆ వివరాలను వెల్లడించడంలో జరుగుతున్న జాప్యం అధికారుల పనితీరును వేలెత్తి చూపిస్తోంది. సాధారణంగా పోలింగ్ జరుగుతున్నప్పుడు ప్రతి గంటకు, రెండు గంటలకు ఒకసారి అప్పటివరకు జరిగిన పోలింగ్ శాతాన్ని అధికారులు ప్రకటిస్తూ ఉండాలి. అప్పుడే ఎన్నికల ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగుతోందన్నది ప్రజలకు అర్థమవుతుంది. ఇతర జిల్లాల్లో ప్రతి రెండు గంటలకు ఒకసారి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శాతాన్ని ప్రకటిస్తున్నా మన జిల్లాలో మాత్రం ఆ పద్ధతి కొనసాగడం లేదు. జిల్లాలో సుమారు 20 వేల మంది ఉద్యోగులు ఓటు వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో సరాసరి రెండు వేల పోస్టల్ బ్యాలెట్లను జారీ చేసి ఒక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజుకు ఐదారు వందల మందికి మించి ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. అయినా ఆ వివరాలను వీలైనంత త్వరగా ప్రజలకు తెలియజేయడంలో ఎన్నికల అధికారులు విఫలమవుతున్నారు. 20 వేల ఓట్ల విషయంలో ఈ పరిస్థితి ఉంటే ఈ నెల 13న జరిగే ప్రధాన పోలింగ్ రోజున 20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోనుండడంతో ఆ రోజు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసే మెకానిజాన్ని ఏర్పాటు చేసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, జిల్లాలో ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతుండగా వాటిలో ఒకరిద్దరు రిటర్నింగ్ అధికారులు మినహా మిగిలిన వారంతా తొలిసారి సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారందరూ కొంత గందరగోళానికి గురవుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్లు జారీలో కూడా కొంత మంది ఓట్లు గల్లంతు కావడం, ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలు సరిగా తెలియజేయకపోవడంతో గందరగోళం తలెత్తడమే ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (5వ తేదీ నుంచి మంగళవారం వరకు)

నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	2315	95.70
నెల్లూరు రూరల్	4809	4335	90
కందుకూరు	1635	1580	96.6
కావలి	2933	2757	93.9
ఆత్మకూరు	2352	2220	94.37
ఉదయగిరి	2336	2207	94.47
సర్వేపల్లి	1332	1255	94.21
కోవూరు	2587	2576	94.88
మొత్తం	20403	19245	94.32

● పోలింగ్ శాతం 95

ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను భారీగా వినియోగించుకున్నారు. ఈ నెల 5 నుంచి మంగళవారం వరకు 95.70 శాతానికి పైబడి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నమోదయ్యింది. కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా 96.6శాతం, నెల్లూరు నగరంలో 95.70 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

● నేడు ప్రత్యేకంగా...

ఫాం-12 ఇప్పటివరకు ఇవ్వని ఉద్యోగులు బుధవారం ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నెల్లూరు: కార్పొరేషన్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

అనారోగ్యశ్రీ!

● నీరుగారుతున్న బృహత్తర పథకం

వ్యాధిగ్రస్థులకు అందనంత దూరంలో 'ఆరోగ్యశ్రీ'

సవాలక్ష కొర్రీలు.. వైద్యంలో కాలయాపన




నెల్లూరు (వైద్యం) మే 7: ఐదేళ్ల క్రితం వరకు 'ఆరోగ్యశ్రీ' పథకం పేదలపాలిట ప్రాణవాయువుగా నిలిచింది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎందరో సాధారణ, సంక్లిష్ట వైద్యసేవలు పొందారు. అలాంటి బృహత్తర పథకం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రోగులకు ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలు అందేవి. 2014 నుంచి 2019 వరకు 1,044 వ్యాధులకు సంబంధించి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు అందించారు. జిల్లాలో 20 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన చికిత్సలు అందేవి. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఆరోగ్యశ్రీ చికిత్సలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు. రూ.5 లక్షల వరకు వైద్య చికిత్సలు అందించేవారు. ఏడాదికి మూడువేలకుపైగా ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేసేవారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెండునెలలకు ఒకసారి డబ్బులు చెల్లించేవారు. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులతో రోగులకు ఎలాంటి సమస్య ఉండేది కాదు.

● ఎండమావిగానే నేడు సేవలు

ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని చెబుతున్నా, అవి ఎండమావిగానే ఉన్నాయి. జిల్లాలో 32 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 28 డెంటల్ ఆసుపత్రులతోపాటు ప్రభుత్వపరంగా మరో 64 ఆసుపత్రులను పథకంలో చేర్చారు. అయితే వీటిలో నెల్లూరు జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రుల్లోనే కొంతమేరకు ఆరోగ్యశ్రీ చికిత్సలు అందుతున్నాయి. డెంటల్ ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డులు ఉన్న వారికే చికిత్సలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు ఆరోగ్యశ్రీ చికిత్సలు అందక అవస్థలు పడుతున్నారు.

● పేరుకున్న బకాయిలు

ప్రస్తుతం జిల్లాలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు వైసీపీ ప్రభుత్వం రూ. 60 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది. 60 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఏడాది దాటినా చెల్లింపులు నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం కేవలం 20 శాతం బకాయిలు మాత్రమే చెల్లిస్తూ పబ్బం గడుపుకుంటోంది. బకాయిలు సరిగ్గా రాకపోవటంతో నెల్లూరులోని రెండు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ నుంచి బయటకు వెళ్లిపోయాయి. కొన్ని ఆసుపత్రులలో అయితే ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించలే మంటూ రోగులకు చెప్పేస్తున్నాయి. దీంతో రోగులు చేసేది లేక డబ్బులిచ్చి వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు.



● రూ.వెయ్యి దాటితే...

కాగా రూ. 1000 ఖర్చు దాటితే ఆరోగ్యశ్రీ సేవలు అన్ని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఉచితంగా చూస్తారంటూ 2021, నవంబరులో వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. దీన్ని దశల వారీగా అన్నీ జిల్లాల్లోనూ అమలు చేస్తామంటూ పేర్కొంది. అయితే మూడేళ్ల కావస్తున్నా అమలు కాలేదు. ప్రస్తుతం 3,255 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చినా ఫలితం ఉండటం లేదు. 2023 డిసెంబరులో ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకు చికిత్సలు అందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కొత్త ఆరోగ్యశ్రీ డిజటల్ కార్డులు కూడా అందించింది. అయితే అవి కూడా అందుబాటులో లేదు.

ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స

2018లో ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఆరోగ్యశ్రీ గుండెవ్యాధితో చికిత్స చేయించుకున్నాను అప్పట్లో నెట్‌వర్క్ ఆసుపత్రి వర్గాలు ఎంతో ఆసక్తిగా సమస్యలను తెలుసుకుని వైద్యం అందించారు. నాకు శస్త్రచికిత్స చేసిన వెంటనే డబ్బులు కూడా వచ్చాయి. ఇది చాలా సంతోషాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల ఆరోగ్యశ్రీ డబ్బులు రావటం లేదని, వైద్య చికిత్సలు చేయలేమని మా ఇంటిపక్కనే ఉన్న ఓ వ్యాధిగ్రస్థుడు ఆందోళన వ్యక్తం చేయటం చాలా బాధేసింది

\- విజయలక్ష్మి

చికిత్స చేయలేదు..

ఊపిరితిత్తులకు సంబంధించి తీవ్రఅనారోగ్యంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయించుకుందామని నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లా. వారు వైద్య చేయలేమని చెప్పారు. ఏందని అడిగితే ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని చెప్పారు. చేసేది లేక డబ్బులు చెల్లించి వైద్య చికిత్స చేయించుకున్నా.

\- శ్రీనివాసులు

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించండి!

- నిబద్ధతతో పని చేయాలని ఆదేశం
- పోలీస్ అధికారులతో రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా



సమీక్షలో మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

నెల్లూరు (హరనాథపురం), మే 7 : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా పోలీసు అధికారులు ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శ కంగా, నిబద్ధతతో పోలీసు అధికారులు పని చేయా లని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులు గుంపులుగా నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో ఓటింగ్ పూర్తయిన తరువాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు పటిష్ఠమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. మిషన్లను స్ట్రాంగ్ రూములకు తీసుకెళ్లే వాహనాలకు సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్నిచోట్ల వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు ప్రణాళికను ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రత్యేక పోలీసు పరిశీలకులు అశోక్ టి.దుదే, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, అదనపు ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

ఎన్నికల సిబ్బంది కోసం బస్‌స్టేషన్ల నుంచి జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు ఆర్టీసీ సంస్థ 255 బస్సులను నడపనుందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు, కావలి, కందు కూరు, ఆత్మకూరు, ఉదయగిరి మెయిన్ బస్‌స్టేషన్ల నుంచి ఈనెల 12న ఉదయం 6 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. తిరిగి 13న రాత్రి 10.30, 11.30, 00.30 గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. ఈ బస్సులలో ఎన్నికల సిబ్బంది నుంచి సాధారణ చార్జీలు వసూలు చేస్తారన్నారు.

భారీగా వలంటీర్ల రాజీనామాలు

- ఇప్పటివరకు 4,062 మంది రిజైన్
- మరో 42 మంది తొలగింపు
- మిగిలినవారిపైనా పెరుగుతున్న ఒత్తిళ్లు

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. పోలింగ్ రోజు సమీపిస్తుండటంతో రాజీనామాల సంఖ్య పెరుగుతోంది. మార్చి 16న ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 4,062 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. నిబంధనలు అతిక్రమించి వైసీపీ ప్రచారంలో పాల్గొన్న మరో 42 మందిని అధికారులే తొలగించారు. మొత్తంగా 4104 మంది తమ ఉద్యోగాలను వదిలి బయటకు వచ్చారు. జిల్లాలో మొత్తం సుమారు 13 వేల మంది వలంటీర్లు ఉండగా అందులో మూడో వంతు మంది రాజీనామాలు చేయడం గమనార్హం. అత్యధికంగా కావలి, కోవూరు, నెల్లూరు సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాల్లో జరిగాయి. కావలి అర్బన్‌లో 450 మంది, కావలి రూరల్‌లో 164 మంది, దగదర్తిలో 141, బోగోలులో 51, నెల్లూరు అర్బన్‌లో 241 మంది, కోవూరులో 225, విడవలూరులో 212, కొడవలూరులో 156, బుచ్చి అర్బన్‌లో 115, బుచ్చి రూరల్‌లో 142 మంది, ఇందుకూరుపేటలో 234 మంది రాజీనామాలు చేశారు. ముత్తుకూరులో 160, మనుబోలులో 63, పొదలకూరులో 108, టీపీగూడూరులో 86, వెంకటాచలంలో 165, చేజర్లలో 103, సంగంలో 149, సైదాపురంలో 102 మంది చొప్పున వలంటీర్లు రాజీనామాలతో ఉద్యోగాలు వదులుకున్నారు. పోలింగ్ సమీపిస్తుం డటంతో ఇంకా అనేక మందిపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. వీరి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసం

● జలదంకి రోడ్‌షోలో సినీహీరో నారా రోహిత్

జలదంకి, మే7: ప్రజావేదిక కూలదోయడం మొదలు సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందేతప్ప, అభివృద్ధి అనేదే లేదని సినీహీరో నారా రోహిత్ ఆరోపించారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని జలదంకిలో మంగళవారం రాత్రి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లతో కలసి ఆయన రోడ్‌షో పాల్గొన్నారు. వారికి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఎస్సీ కాలనీ వద్ద నుంచి గ్రామవీధుల్లో రోడ్‌షో నిర్వహించారు. స్థానిక చావిడి సెంటర్‌లో ప్రచార రథం పైనుంచి అభిమానులను ఉద్దేశించి నారా రోహిత్ మాట్లాడారు. రాష్ట్రానికి చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే బీజేపీ టీడీపీ, జనసేనలు కలసి పోటీచేస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి ఎంపీగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యేగా కాకర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ జలదంకి మండలంలో కూటమికి అత్యధిక మెజారిటీ సాధించి పెట్టాలన్నారు. అలా చేస్తే మండలాన్ని తాను, సురేష్ కలసి అభివృద్ధి చేస్తామన్నారు. కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి తాను ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసుకున్నానని, దాని ప్రకారం ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి తోడ్పాటుతో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మేనిఫెస్టోను నారా రోహిత్ చేతుల మీదుగా కాకర్ల ఆవిష్కరింపజేశారు. చినక్రాకలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ తాను ఎమ్మెల్యేగా ఉన్నకాలంలో గ్రామ ప్రజలు తనపై ఎంతో ఆదరణ చూపారని, అలాగే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లలకు సైకిల్‌గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ మధుమోహన్‌రెడ్డి, ఉప సర్పంచి కే మాలకొండారెడ్డి, నాయకులు ఏగూరి రఘు, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రి యాదవ్ మధుసూదనరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



జలదంకి రోడ్‌షోలో ప్రసంగిస్తున్న సినీహీరో నారా రోహిత్, పక్కన వీపీఆర్, కాకర్ల

ఆత్మకూరు ఉదయగిరి

ఓటు వేసిన 530 మంది ప్రభుత్వ ఉద్యోగులు

ఉదయగిరి రూరల్, మే 7: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధులకు వెళ్లనున్న ఉద్యోగులు మంగళవారం (మూడోరోజు) 530మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో రాజారమేష్ ప్రేమకుమార్ తెలిపారు. నియోజకవర్గంలో 2,336 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా ఇప్పటివరకు 2207 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుఉన్నట్లు చెప్పారు. మిగిలిన వారికి బుధవారమే మాత్రమే చివరి అశకాశం ఉందన్నారు.

మేకపాటిపై చర్యలు తీసుకోవాలి: పొట్లూరి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష



మాట్లాడుతున్న పొట్లూరి శ్రీనివాసులు

ఆత్మకూరు, మే 7: స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపవరపు వెంకట రమణమ్మను కులం పేరుతో కించిపరస్తూ మాట్లాడిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని వెన్నలకంటి రాఘవయ్య మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆత్మకూరుకు విచ్చేసి గోపవరపు వెంకటరమణమ్మను పరామర్శించి మాట్లాడారు. బాధ్యత గల మాజీ ఎంపీ.. ఒక మహిళాప్రతినిధిని కులం పేరు ఎత్తడమే కాకుండా, నెత్తి మీద రూపాయ పెడితే పైసాకు పనికిరాదని వ్యంగంగా మాట్లాడడం సరికాదన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఎన్నికల అనంతరం మర్రిపాడు పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజన సంఘాల సభ్యులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు.

66 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

ఆత్మకూరు, మే, 7: ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు, అనుమసముద్రం పేట, అనంతసాగరం, మర్రిపాడు, సంగం, చేజర్ల మండలాలు ఈ సెగ్మెంట్ పరిధిలో ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో అధికారులు 278 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 66 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- **మర్రిపాడు మండలం..**

చాబోలు, తిమ్మాయపాళెం, తిక్కవరం, మర్రిపాడు, కేతిగుంట, రామనాయుడుపల్లి.

- **అనంతసాగరం..**

చిలకలమర్రి, అనంతసాగరం, లింగంగుంట, మినగల్లు.

- **ఆత్మకూరు..**

కరటంపాడు, నెల్లూరుపాళెం, బండారుపల్లి, అప్పారావుపాళెం, వాశిలి, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో మరో ఆరు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశారు.

- **ఏఎస్‌పేట..**

చౌటభీమవరం, పొనుగోడు, పెద్దబ్బీపురం, కావలియడవల్లితో పాటు ఏఎస్‌పేటలో నాలుగు పోలింగ్ కేంద్రాలు.

- **సంగం..**

తలుపూరుపాడు, చెన్నవరపుపాడు, వెంగారెడ్డిపాళెం, మండల కేంద్రమైన సంగంలో జీబీకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 12పోలింగ్ కేంద్రాలు.

- **చేజర్ల..**

పుల్లనీళ్లపల్లి, మామిడూరు, వావిళ్ల, చిత్తలూరు, బిల్లుపాడు, నాగలవెల్లటూరు, చేజర్లలో మూడు పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక ంగా గుర్తించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల, పోలీసు అధికారులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు.



ఆత్మకూరు నియోజకవర్గ చిత్రపటం

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

మనుబోలు, మే 7: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై మనుబోలు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నా యి. 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆనవాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్, ఫీల్డ్ అసిస్టెంట్

తోటపల్లిగూడూరు, మే 7 : మండలంలోని చింతోపు గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీర్ ఏల్లూరు వెంకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బుర్రి కృష్ణయ్య, ఆ గ్రామ సర్పంచ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీకి ఓటు వేయాలంటూ సోమవారం రాత్రి ఇంటింటా ప్రచారం చేశారు.

సోమశిలలో 8.012 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 7: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. మంగళవారానికి జలాశయంలో 8.012 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

సంగం, మే 7: అనసూయనగర్ గ్రామానికి చెందిన అత్తిపాటి రవి (40) గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు వ్యవసాయ పనులు చేసుకుని జీవించే ఈయన సోమవారం రాత్రి గడ్డి మందు తాగి ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు ఓటు హక్కుపై ఫిర్యాదు

కలువాయి, మే 7: మండలంలోని దాచూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 41వ నెంబరు పోలింగ్ కేంద్రం సంబంధించిన ఓటర్ల జాబితాలో పలువురి మైనర్ల పేర్లు ఉన్నాయని మంగళవారం గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు. ఆధార్‌కార్డుల్లో పుట్టిన తేదీలను మార్ఫింగ్ చేసి నకిలీ పత్రాలు సమర్పించి వారు ఓటుహక్కు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దారు సంజీవకుమారిని వివరణ కోరగా ఈ విషయమై తమకు అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో విచారణ జరిపిస్తానని చెప్పారు.

వడదెబ్బకు జొన్నవాడ మాజీ సర్పంచు మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 7: మండలంలోని జొన్నవాడ గ్రామ మాజీ సర్పంచు పుట్టా (కోవూరు) బుజ్జమ్మ (79) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందింది. గత కొన్ని రోజులుగా విపరీతంగా కాస్తున్న మండుటెండలకు తట్టుకోలేక వడదెబ్బతో గత రెండురోజులుగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు మృతురాలి బంధువులు తెలిపారు.



జొన్నవాడ మాజీ సర్పంచు పుట్టా బుజ్జమ్మ (ఫైల్)

మహిళ గౌరవ భంగం కేసులో నిందితుడికి జైలుశిక్ష

ముత్తుకూరు, మే 7: మహిళ గౌరవ భంగం కేసులో నిందితునికి జైలుశిక్ష విధించినట్లు ముత్తుకూరు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాళ్లపూడి గ్రామంలో ఏప్రిల్ 25వ తేదీన ఒక మహిళ కల్లు అమ్ముతుండగా అల్లంపాటి సుబ్రహ్మణ్యం వచ్చి డబ్బులు ఇవ్వకుండా కల్లు పొయ్యమని అడిగాడు. అందుకు సదరు మహిళ నిరాకరించినందుకు ఆమె చెయ్యి పట్టుకుని లాగి అవమానపరిచాడు. దీంతో ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో సుబ్రహ్మణ్యంపై కేసు నమోదుచేసి తగిన సాక్ష్యాలు పొందుపరచగా, ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో నెల్లూరు రైల్వే కోర్టు జడ్జి వినోద్ నిందితుడు అల్లంపాటి సుబ్రహ్మణ్యంకి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి

- వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి రూరల్, మే 7: వైద్య ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలని మండల వైద్యాధికారి శివకల్పన తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆమె సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి గళ్ల పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. గర్భవతుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకొని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరులో ప్రపంచ ఆస్తమా దినోత్సవం

వింజమూరు: స్థానిక మాసిలామణి ఆస్పత్రిలో ప్రపంచ ఆస్తమా దినో త్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాసిలామణి ఆస్తమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆస్త మా అనేది అంటువ్యాధి కాదని అది ఎలర్జీ వలన వస్తుందన్నారు. ఆస్తమా ఉన్న వారికి ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుందని, శ్వాస వదిలేటప్పుడు పిల్లి కూతలు, ఆయాసం, దగ్గు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలంటే చలి వాతావరణంలో తిరగరాదన్నారు. కార్యక్ర మంలో ఆయన వెంట వైద్యుడు ప్రశాంత్, వైద్య సిబ్బంది తదతరులు ఉన్నారు.

దోచుకున్న రూ.లక్షల కోట్లు.. ప్రజాకోర్టులో దాచగలవా?: ఆనం



మర్రిపాడు: ప్రచారంలో మాట్లాడుతున్న ఆనం

మర్రిపాడు, మే 7: పింఛన్లు నెలకు రూ.3వేలు పంపిణీ చేసి రూ.3లక్షల కోట్లు దోచిన సీఎం జగన్‌రెడ్డి, దోచుకున్న లక్షల కోట్లు ఏం చేసుకుంటావు అని, ప్రజాకోర్టులో ఈ లక్షల కోట్లు దాచగలవా అని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయని వైసీపీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపడం ఖాయం అన్నారు. మంగళవారం రామానాయుడుపల్లి, నందవరం, డీసీపల్లి, కంద్రిక, భీమవరంలో ఆయన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. హై లెవెల్ కెనాల్ నిర్మాణానికి గతంలో తాను తెచ్చిన పంపుసెట్లు, మోటార్లు బిగించేందుకు మేకపాటి కుటుంబానికి చేతకాక తుప్పి పట్టేలా చేశారని ఎద్దేవా చేశారు. ఇటీవల మేకపాటి రాజ మోహన్ రెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, ధనుంజయరెడ్డి, గిరినాయుడు పాల్గొన్నారు. సా యంత్రం ఆనం కైవల్యారెడ్డి పడమటినాయు డుపల్లి లో ప్రచారం నిర్వహించారు.

ఆత్మకూరు: కూటమి టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆనం కైవల్యారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని 7వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమశిల రోడ్డు సెంటర్‌లో టీడీపీ, బీజేపి, జనసేన నాయకులు తెల్లవారుజాము నుంచే ప్రచారం మొదలు పెట్టారు. కార్యక్రమంలో తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ గౌస్‌బాష, కుడుముల సుధాకర్‌రెడ్డి, కాలం బుజ్జిరెడ్డి, కరటంపాటి సుధాకర్, నలిశెట్టి జగదీష్ పాల్గొన్నారు.

సంగం: ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటు చేసి ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని ఆనం రంగ మయూర్‌రెడ్డి తెలిపారు. గాంధీజనసంఘంలో ఆత్మకూరు అభ్యర్థి ఆనం, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అనంతసాగరం: టీడీపీ మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత, సాగరం ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ స్థానిక గుంతబజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్బరాజు, పాతపాటి మధుసుదన్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, రాపూరు సుబ్బారెడ్డి, మనోజ్‌రెడ్డి, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్రచారంలో కైవల్యారెడ్డి

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పూర్తి చేస్తాం

- నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి
- దుత్తలూరులో కాకర్ల సురేష్‌తో కలిసి ప్రచారం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 7: దశాబ్దాలుగా కొనసాగుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులను ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే పూర్తి చేసి మెట్ట ప్రాంతంలో రవాణా రంగం అభివృద్ధికి చర్యలు చేపడతామని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌తో కలిసి మంగళవారం దుత్తలూరులో సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో వేమిరెడ్డి పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని కృష్ణమందిరం నుంచి సెంటర్ వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు వారిని భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిని చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. చంద్రబాబు అంటే అభివృద్ధి, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబుగా వర్ణించారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తిచేసి మెట్ట ప్రాంతాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. స్వయాన దేశ ప్రధాని నరేంద్రమోదీనే రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, ఇసుక, మద్యం, మట్టి మాఫియాలు రాజ్యమేలుతున్నాయని చెప్పాడంటే ప్రజలు ఆలోచించాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో తమకు కేంద్రం మద్దతు ఉంటే అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళతామని, లేదంటే ఇబ్బందులు తప్పవన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ నేతల బెదిరింపులకు బెదరవద్దని, ప్రతిఒక్కరు ధైర్యంగా 13న జరిగే పోలింగ్ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనతోపాటు కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నేతలు చెంచలబాబు యాదవ్, మేకపాటి శాంతకు మారి, కంభం అనసూయమ్మ, మన్నేటి వెంకటరెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, పేలపూడి వెంకటరత్నం, నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉండేలా గురవారెడ్డి పాల్గొన్నారు.



దుత్తలూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాకర్ల సురేష్

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: కాకర్ల

ఈ ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశ మిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. పల్లెపల్లెకు కార్యక్రమంలో భాగంగా సోమల రేగడ, దుత్తలూరు, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మన ఆస్తులు పదిలంగా ఉండాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. ప్రజల ఆస్తులను కాజేసేందుకు ఈ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకరావడం సిగ్గుచేటన్నారు. రౌడీరాజ్యం కావాలా, రామరాజ్యం కావాలా ప్రజలే తేల్చుకోవాలన్నారు. 40 ఏళ్ల నియోజకవర్గాన్ని పాలించిన ఓ కుటుంబం ఎలాంటి అభివృద్ధి చేయకుండా మరలా ప్రజల ముందుకు వచ్చి బూటకపు హామీలు ఇస్తున్నారని, వారిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉండేలా గురవారెడ్డి, మల్లంపాటి గురవయ్యానాయుడు, గుండాల క్రిష్టారెడ్డి, మాదాల రామచంద్ర, చీదర్ల మల్లికార్జున, ధనాల పేరయ్య, చేజర్ల భాస్కర్‌రెడ్డి, కాకర్ల మధు, శనివారపు సుబ్బారెడ్డి, చల్లా ప్రసాద్, పాముల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కలిగిరి: తెలుగుదేశం హయాంలోనే మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందని ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సతీమణి ప్రవీణ తెలిపారు. సిద్దనకొండూరులో మహిళలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితబస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 18ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఇంట్లో ఎంత మంది చిన్నారులు స్కూల్‌కు వెళ్తుంటే, ప్రతి చిన్నారికి ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌కు సైకిల్‌గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకర్ల ధాత్రి, పద్మావతి, వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పువ్వాడి మోహన్‌రావు, త్రోవగుంట మాల్యాద్రి, దారా వెంగళరావు, గంగినేని రంగారావు, రాము, బాలయ్య పాల్గొన్నారు.

సీతారామపురం: మండలకేంద్రంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశిరావు, తెలుగుదేశం యుత్ లీడర్ దేవర వెంకటేశ్వర్లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, తోట మాల్యాద్రి, జయరాములు, తమ్మిశెట్టి రమణయ్య, తోట మనోజ్, బండి రవి, తోట ఏడుకొండలు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తురకపాలెం హరిజనవాడలో..


జెడ్పీ మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చెంచల బాబు యాదవ్ మహిళా విభాగం సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, మండల కో ఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కలవెల జ్యోతి పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: సంజీవరాజుపల్లి, జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెం, బండకిందపల్లి, కొత్తపల్లి, అయ్యవారిపల్లి, లింగంనేనిపల్లి, పుల్లాయపల్లి బోడబండ, శకునాలపల్లి, కృష్ణంపల్లి, ఆర్లపడియ, కోటాయపల్లి, సాతువారిపల్లి గ్రామాల్లో బుధవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వింజమూరు: ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల సునీల్ మంగళవారం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన ఆర్ఎంపీల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నెల్లూరు జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంక టేశ్వర్‌రెడ్డి, మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ చిరంజీవిరెడ్డి, జిల్లా పార్లమెంటు వైద్య విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ షేక్‌సిరాజ్ (గ్రామీణ వైద్యులు సంఘం), కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షులు డాక్టర్ ఖాజామియా షేక్, ప్రధాన కార్యదర్శి వీఎల్ నారాయణరావు, ఉపాధ్యక్షులు సయ్యద్ ఖాజామొహిద్దీన్, ఎం.శ్రీహరినాయుడు, జి.హజరతయ్య పాల్గొన్నారు.



సిద్ధనకొండూరులో మహిళలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న కాకర్ల ప్రవీణ



సోమలరేగడలో కాకర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

భార్యను దారుణంగా చంపిన భర్త

- కత్తితో నరికి.. సుత్తితో మోది హత్య
- కేసు రాజీకి పలుమార్లు బెదిరింపులు
- కుమారుడ్ని ఇవ్వాలని ప్రాధేయపడిన భార్య



అమల (ఫైల్)

నెల్లూరు(క్రైం). మే 7: కంటికి రెప్పలా కాపాడాల్సిన భర్తే.. భార్యను దారుణంగా హత్య చేశాడు. రాత్రి భర్త దాడి నుంచి తప్పించుకుని వెళ్లిన భార్య ఉదయం ఇంటికి చేరు కోగా, ఇంట్లో దాక్కొని ఒక్కసారిగా కత్తితో నరికి, సుత్తితో తలపై మోది హత్య చేశాడు. కత్తి, సుత్తిలను చేత్తో పట్టుకొని నేను చంపేశా... అం టూ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కోవూరు షుగర్‌ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన పీ అమల(37)కు గతంలోనే వివాహం జరిగింది. ఆమెకు ప్రవీణ్ అనే కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె భర్త నుంచి విడాకులు తీసుకొని, కుమారుడితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో బాలాజీ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ కే మునిరత్నంకు ఐదేళ్ల క్రితం అమలను ఇచ్చి పెద్దలు రెండో వివాహం చేశారు. అమలకు రెండో సంతానంగా యోగేష్ జన్మించాడు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగినా ఆ తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వారు విడిపోయారు. అమల తన మెదటి కుమారుడితో కలిసి భగత్‌సింగ్‌కానీలో నివాసం ఉంటోంది. మునిరత్నం తన కుమారుడు యోగేష్‌తో కలిసి బాలాజీనగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో అమల భర్తపై వరకట్నపు వేధింపుల కేసు పెట్టింది. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. తన రెండో కుమారుడిని ఇవ్వాలని అమల భర్తను పదేపదే ప్రాధేయపడింది. తనపై పెట్టిన కేసు రాజీ చేసుకుంటే కుమారుడిని ఇస్తానని మునిరత్నం చెప్పేవాడు. ఈ క్రమంలో అప్పుడప్పుడు మునిరత్నం భార్య వద్దకు వచ్చి కేసు రాజీ చేసుకోవాలని కోరేవాడు. అంతేకాక నీకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందని కూడా గొడవ పెట్టుకునేవాడు. కేసు రాజీ పడకుంటే చంపేస్తానని పలుమార్లు బెదిరించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆయన భార్య వద్దకు వచ్చి చంపేందుకు యత్నించాడు. దీంతో అమల తన కుమారుడితో కలిసి ఇంట్లో నుంచి పారిపోయి భగత్‌సింగ్ కాలనీలోని శ్రీరాంవెల్డింగ్ షాపులో రాత్రంతా ఉండి ఉదయం ఇంటికి వెళ్లింది. అప్పటికే ఇంట్లో దాక్కొని ఉన్న మునిరత్నం ఆమెపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. సుత్తితో బలంగా తలపై మోదాడు. అమల పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లగా మునిరత్నం కత్తి, సుత్తి చేతిలో పట్టుకొని.. దాన్ని నేనే చంపేశాను .. అంటూ బయటకు వచ్చాడు. వారు లోపలికి వెళ్లి చూడగా అమల రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. దీంతో వారు జరిగిన విషయాన్ని స్థానిక వీఆర్‌వో శ్రీదేవికి తెలియజేశారు. ఆమె నవాబుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం బాబి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్ మార్చురీకు తరలించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ బాబి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, మే 7: కావలి మండలం అడవిలక్ష్మీపురం రైల్వే గేటుకు సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి స్థానికుల సహాయంతో రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. రైల్వే గేటుకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటన సుమారు 7 నుంచి 10 రోజుల క్రితం జరిగి ఉండడంతో మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతూ గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతుడు 5.6 ఎత్తు కలిగి సిమెంట్ కలర్ పొడవు చేతుల చొక్కా, డ్రాయర్ ధరించి ఉన్నాడు. అంతకుమించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాటూరి శ్రీనివాసరావు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6814
వెండి కిలో ధర	రూ. 84,000
వెండి ఒక గ్రాము	రూ. 86.00

ఓఆర్ఎస్, భోజన ప్యాకెట్ల పంపిణీ

కావలిటౌన్, మే 7: సామాజిక కార్యకర్త, న్యాయవాది ఐ సాయిప్రసాద్ తన తల్లి కన్నెమ్మ జ్ఞాపకార్థం మంగళవారం పట్టణంలోని నిరాశ్రయులు, యాచకులకు ఓఆర్ఎస్, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులు యాచకులు ఎండల్లో బయట తిరగొద్దని, వడదెబ్బ తగలకుండా నీడపట్టున ఉండాలని, ఎక్కువగా మంచినీరు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

విజయసాయిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

ఉలవపాడు, మే 7 : ముస్లిం రిజర్వేషన్‌పై బీజేపీతో కలిసి టీడీపీ నాటకం ఆడుతుందన్న విజయసాయి రెడ్డి మాటలు అవాస్తవమని టీడీపీకి చెందిన స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. మంగళవారం కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి రాజకీయ లబ్ధికోసం చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను ముస్లింలు నమ్మవద్దని, టీడీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో టీడీపీ ముస్లిం నేతలు ఎస్‌కే జిలానీ బాషా, ఎస్‌కే బాబు, డాక్టర్ కరీం, ఎస్ఎం బాషా తదితరులు ఉన్నారు.

'కందుకూరు'ను పరిశ్రమల హబ్‌గా మారుస్తా

- సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- గెలుపు సమస్యే కాదు.. భారీ మెజార్టీ లక్ష్యంగా పని చేస్తున్నాం
- కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కందుకూరు, మే 7: 'కందుకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తా. ఆ తర్వాత ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడం, సాగునీటి వసతి కల్పించడం కోసం రూపొందించుకున్న నిర్దిష్ట ప్రణాళికను అమలు చేస్తా. ఇక కందుకూరు పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటంతోపాటు మౌలిక వసతులను అభివృద్ధి చేసి సుందర పట్టణంగా తిర్చిదిద్దుతా. నియోజకవర్గంలో ప్రధాన జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో పండించిన పంట ఉత్పత్తులకు ఇక్కడే గిట్టుబాటు ధరకు ఆయా పరిశ్రమల వారు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటా"నని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వివరించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కందుకూరులో విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాబోయే టీడీపీ ప్రభుత్వం ద్వారా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వద్ద ఉన్న ప్రణాళికలను వివరించారు.

? ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన ఎలా ఉంది.

! ప్రజాస్పందన అద్భుతంగా ఉంది. ఏ గ్రామం వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా వైసీపీ పాలనపై విసుగెత్తిపోయిన అనేకవర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఆపార్టీని వీడి పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఏదో మొక్కుబడిగా కాకుండా ఉరకలెత్తుతున్న ఉత్సాహంతో వారు మా వెంట నడుస్తున్న తీరు జగన్ పాలనలో వారు ఎంత విసుగెత్తిపోయారో అర్థమయ్యేలా చేస్తోంది.

? బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు టీడీపీలో చేరుతున్నారా

! అగ్రవర్ణ సామాజిక వర్గంతో అన్నివర్గాల వారు మా పార్టీలో చేరుతున్నారు. నెలరోజులుగా టీడీపీలో చేరిన వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీల కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారు. అన్నివర్గాల్లోనూ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కొత్త ఓటర్లు, యువత, విద్యావంతులు నూటికి నూరుశాతం మాపార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు.

? వైసీపీ కంచుకోటను బద్దలు కొడతారా

! జగన్ పాలనపై ప్రజలు విసుగెత్తి ఉండటానికి తోడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప ఈ రాష్ట్రానికి భవిష్యత్తు లేదన్న నిశ్చితాభిప్రాయానికి ప్రజలు వచ్చారు. దీనికితోడు ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ వర్గాలకు నాయకత్వం వహించిన వారు నేడు పోటీలో లేరు. అందువల్ల నియోజకవర్గంలో కొత్త సమీకరణలు చోటుచేసుకుంటున్నాయి. కచ్చితంగా వైసీపీ కోటను బద్దలు కొట్టి విజయం సాధిస్తాము.

? కొత్త సమీకరణలు మీకే లాభం అని ఎలా అనుకుంటారు.

! అందులో ఎలాంటి సందేహం లేదు. నేను స్థానికుడిని. ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గ రాజకీయాల్లో వివిధ హోదాల్లో పనిచేయడం ద్వారా అన్ని గ్రామాల్లో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు, ఇక్కడి మౌలిక వసతులు, సమస్యలపై నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ఇక నా ప్రత్యర్థి స్థానికుడు కాదు. ఎక్కడో కనిగిరి నుంచి తీసుకొచ్చి ఇక్కడ అభ్యర్థిగా పెట్టారు. కనిగిరి మా పొరుగు నియోజకవర్గమే కావడం వల్ల ఆయన వ్యవహారశైలి, అవినీతి వ్యవహారాలు ఇక్కడ ప్రజలకు బాగా తెలిసిపోయాయి. అక్కడి ప్రజలు తిరస్కరిస్తేనే ఇక్కడికి పంపారు. అలాంటి వ్యక్తి మనకు ఎలా న్యాయం చేస్తాడని ప్రజలే బహిరంగంగా చెబుతున్నారు. దీనికితోడు ఆయనకు ఈప్రాంత నాయకులతో కనీస పరిచయాలు కూడా లేకపోవడం వల్ల వాళ్ల పార్టీ కోసం కష్టపడ్డ వారినే గుర్తించలేకపోతున్నారు.

? అంటే.. కందుకూరులో మీ విజయం ఖాయమంటారు.

! నూటికి నూరుశాతం.. కేవలం విజయం కాదు.. మంచి మెజారిటీ సాధిస్తా. మా ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కూడా ఊహించని ఆధిక్యత కందుకూరు నియోజకవర్గంలో వస్తోంది. ఆయన మంచితనం, సేవాకార్యక్రమాలు, ఆయన టీం క్షేత్రస్థాయిలో చేస్తున్న పని కూడా నా విజయంలో కీలకం అవుతోంది.

? గెలిచాక నియోజకవర్గ ప్రజలకు ఏం చేయబోతున్నారు

! కందుకూరు వ్యవసాయాధారిత ప్రాంతం. అందుకే సాగునీటి వసతులను మెరుగుపరచడం కోసం పనిచేస్తాను. సరైన సాగునీటి వసతి లేని వలేటివారిపాలెం మండలం, లింగసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీటి సమ స్య పరిష్కారానికి చర్యలు చేపడతా. ముఖ్యంగా రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులను పూర్తి చేయించగలిగితే చాలా గ్రామాలకు సమస్య తీరుతోంది. రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీరు ప్రతిఏటా వచ్చేలా చూడడం ద్వారా మిగులు నీటిని తూములేరు ద్వారా వలేటివారిపాలెం మండలంలోని సాగునీటి చెరువులను నింపేందుకు చర్యలు చేపడతా. అలాగే రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనపై దృష్టిపెడతా. కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తించా. పంటసాగు చేసి నష్టపోతున్నది కౌలు రైతు అయితే విపత్తుల సమయంలోనూ, ఇతరత్రా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల రూపంలోనూ అసలు వ్యవసాయమే చేయకుండా కౌలుకు ఇస్తున్న భూయజమాని లబ్ధిపొందుతున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపడతా.

? నియోజకవర్గ అభివృద్ధి కోసం మీ ప్రణాళికలు

! కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు, ఉలవపాడు మండలాలు పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలంగా ఉన్నందున ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేసి పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతా. కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలను వ్యవసాయరంగంలో పరిపుష్టం చేయడం ధ్యేయంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. ఈ మూడు మండలాల్లోనూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూస్తా. ఉలవపాడు మామిడి రైతుకు గిట్టుబాటు ధరలు లభించేలా ఎగుమతుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటా.

? కందుకూరు పట్టణాభివృద్ధికి ఏం చేస్తారు

! ముఖ్యంగా శాంతిభద్రతలను కాపాడటమే నా ప్రథమ ప్రాధాన్యత. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరిస్తా. పట్టణానికి సుదూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటయ్యేలా చూసి పట్టణ సుందరీకరణపై దృష్టిపెడతా. రాష్ట్రంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను.

మా నాన్నను గెలిపించండి !

- కాకర్ల కోసం తనయ, తనయుడి ఇంటింటి ప్రచారం

జలదంకి, మే 7: మా నాన్నను గెలిపించాలని కోరుతూ ఉదయగిరి ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ కుమారుడు సంహిత్, కుమార్తె ధాత్రిలు మంగళవారం మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ జువ్విచెట్టుపాలెంలో స్థానిక నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కూటమి మేనిఫెస్టో కరపత్రాలు ఓటర్లకు అందజేసి ఎమ్మెల్యేగా మానాన్న కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సంహిత్ మిత్రుడు మాలేపాటి మానస్‌తేజ, స్థానిక కూటమి నేతలు గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, వంటేరు రాకేష్‌రెడ్డి, స్వర్ణ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

లింగసముద్రం, మే 7 : రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని పెదపవని గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కందుకూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్ కోరారు. మంగళవారం సాయంత్రం టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ



పెదపవనిలో సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టోల గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు

కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి మాలకొండయ్య, రావెళ్ల మాలకొండయ్య, షేక్ రఫీ, సయ్యద్ రఫీ, షేక్ కాదర్ బాషా, గిన్నె కొండయ్య, పఠాన్ హిదయతుల్లా, టంకం హజరత్, షేక్ కరీముల్లా, షేక్ నాయబ్, షేక్ అహమ్మద్, జనసేన నాయకుడు షేక్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు : ఇంటూరి



కందుకూరు : ఇంటూరికి స్వాగతం పలుకుతున్న వైసీపీ శ్రేణులు



వలేటివారిపాలెం : పార్టీ కండువాలు వేస్తున్న నాగేశ్వరరావు

కందుకూరు, మే 7 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవలంబిస్తున్న విధానాలు నచ్చక, ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతతో టీడీపీలోకి వైసీపీ నుంచి భారీగా వలసలు జరుగుతున్నాయని కందుకూరు ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటి పరిధిలోని వెంకటాద్రిపాలెంలో జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, మల్లికార్జున, కొండయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, మనోహర్, తదితరులు భారీగా వైసీపీ నుంచి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని 12వ వార్డులోని షేక్ కరంతుల్లా, షేక్ జిలాని, తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికి ఇంటూరి పసుపు కండువాలు కప్పి స్వాగతం పలికారు. గుడ్లూరు మండలం మోచర్ల పంచాయతీ తెట్టు గ్రామంలో రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అలహరి బాలకృష్ణ, కే మల్లికార్జునరావు, తిరుమల, మం డే కృష్ణారావు, సాయితోపాటు మరికొందరు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఇంటూరి ఆహ్వానం పలికారు.

నూకవరంలో పలువురు టీడీపీలో చేరిక

వలేటివారిపాలెం : మండలంలోని నూకవరంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో దాచర్ల కొండయ్య, దాచర్ల వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి ఇంటూరి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ కార్యకర్తలకు ఎప్పుడూ ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

ఉలవపాడు : మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీని వీడి భారీగా టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి కందుకూరు నియోజకర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, పాతరెడ్డిపాలెం, కొత్త రెడ్డిపాలెంకు చెందిన కొమట్ల వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి స్వామిరెడ్డి, రమణారెడ్డి, కావూరి శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పీ వెంకటరామిరెడ్డి, మహేష్, ఏడుకొండలు, గొట్టా రాము, మురళీకృష్ణలతోపాటు 70 మంది వైసీపీని వీడి డీపీపీలో చేశారు. అదేవిధంగా వీరేపల్లి ఎస్టీకాలనీ, ఆత్మకూరు గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఆయా గ్రామాల్లో కొత్త, పాత టీడీపీ నేతలు సమన్వయంతో పనిచేసి తనని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటూరి కోరారు.



ఉలవపాడు : టీడీపీలో చేరిన ఎస్టీలతో ఇంటూరి

సౌజన్య ఇంటింటి ప్రచారం

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, కాకర్లవారిపాలెం గ్రామాలలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సతీమణి సౌజన్య మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు చూపించి తన భర్త నాగేశ్వరావును ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణి, చెరువుపల్లి సాంబశివరావు, అనిల్‌కుమార్, హనుమంతరావు, కామినేని మల్లికార్జున, ఇరపని లక్ష్మయ్య, గువ్వల నరసింహరావు మాల్యాద్రి, చొప్పర బ్రహ్మయ్య, ఇరపని కల్యాణ్, అనిల్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

- చౌదరిపాలెంలో కావ్య క్రిష్ణారెడ్డి ఇంటింటి ప్రచారం



కావలి రూరల్ : అవ్వా.. నీ ఓటు సైకిల్‌కే వేస్తావుగా.. కావ్య

కావలి రూరల్, మే 7: తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమిస్తే కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌదరిపాలెంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కావ్య క్రిష్ణారెడ్డికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. జలదంకి మండలం కమ్మపాలెంకు చెందిన గంటా సుబ్బానాయుడు ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిపై కావ్య గ్రామంలో ప్రచార యాత్ర సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పంచాయతీగా ఉన్న చౌదరిపాలెంను మున్సిపాలిటీలో కలిపారని, దాంతో ఉపాధి హామీ పనులు కూడా లేక గ్రామంలో పేదలైన ఎస్సీ, ఎస్టీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రైతులు సాగు చేస్తున్న పొగాకు బ్యార్నీలకు కూడా పన్ను కట్టాల్సి వస్తుండటంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే చౌదరిపాలెంను మున్సిపాల్టీలో నుంచి తొలగించి పంచాయతీగా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో మంచి నీటి చెరువుకు నీరు పెట్టేందుకు కాలువకు ప్రతిసారి కట్టలు వెయ్యాల్సి వస్తుందని, అలా కాకుండా చెక్‌డ్యాం ఏర్పాటు చెయ్యాలని గ్రామస్థులు కోరగా అందుకు ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలోని భూములు ఎక్కువగా జలదంకి మండలంలోని జలదంకి, బ్రాహ్మణక్రాక రెవెన్యూ పరిధిలో ఉండడంతో ఇక్కడ రైతులకు పాస్‌బుక్‌లు కూడా రావడం లేదని, 1960 సంవత్సరం నాటి భూములకు కూడా పాస్‌బుక్‌లు లేవని రైతులు చెప్పారు. దీంతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ గ్రామ సభలు పెట్టి పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు కండ్లగుంట మధుబాబు నాయుడు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, బొట్లగుంట శ్రీహరినాయుడు, స్థానిక టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, మండువ వాసు, పోకరి రాంబాబు, గొంది చందు, కోడెల క్రిష్ణ, ముప్పరాజు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : నువ్వే గెలవాలంటూ క్రిష్ణారెడ్డికి విజయతిలకం దిద్దుతున్న మహిళ

పదేళ్లు ఎమ్మెల్యేగా చేసిందేమిటి?

దగదర్తి(బిట్రగుంట) : ఐదేళ్లు ప్రతిపక్షంలో, మరో ఐదేళ్లు పాలక పక్షంలో ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి నియోజక వర్గానికి ఏమి చేశాడని టీడీ పీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర ప్రశ్నించారు. దగదర్తి మండలం రంగసంముద్రం పంచాయతీలోని ఐతంపాడు, కొత్తూరు, పాతూరు, మారెళ్లపాడు, మనుబోలుపాడు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో కావలి కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి బీద రవిచంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఐదు గ్రామాల రైతులకు ఆధారమైన ఉత్తరకాలువలో జిల్లాలో ఇరిగేషన్ మంత్రి ఉన్నా పిడికెడు పూడిక తీసిన పాపానా పోలేదన్నారు. సీఎంకు ఎంతో సన్నిహితుడనని చెబుతున్న ఎమ్మెల్యే దగదర్తి రైతుల కోసం చేసింది ఏముందని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో ఆయన చేసింది ఏమైనా ఉందంటే కంటికి కనిపించిన చోట గ్రావెల్, మట్టి అక్రమంగా తవ్వుకుపోవడం, అడి గిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం తప్ప మరొకటి లేదన్నారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి అసెంబ్లీ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గెలిపించాలని కోరారు. రైతు పక్షపాతి చంద్రబాబునాయుడు సీఎం అయితే రైతుల జీవితాలు బాగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అలహరి సుధాకర్, పమిడి రవికుమార్ చౌదరి, మాలేపాటి భానుచందర్ నాయుడు, సీవీ సత్యం పాల్గొన్నారు.



కావలి రూరల్ : చౌదరిపాలెంలో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

పదవులు ఆశించకుండా అభివృద్ధికి కృషి చేశా

- ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతా అవినీతి మయం
- యువత భవితకు చంద్రబాబు సీఎం కావలి : బీద

అల్లూరు, మే 7 : పదవులు ఆశించకుండా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతా అవినీతిమయంగా మారిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఆయన స్వగ్రామమైన ఇస్కపల్లి పంచాయతీలోని శంభునిపాలెం, ఇస్లాంకాలనీ, అరుంధతీయవాడ, దళితవాడ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నెల్లూరు పార్లమెటు ఉపాధ్యక్షుడు బీద గిరిదర్, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చరణ్‌రెడ్డిలతో కలసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ముందుగా శంభునిపాలెం గ్రామస్థులతో మాటామంతీ కలిపారు. అనంతరం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానన్నారు. ఆ కృషి ఫలితమే ఈరోజుకీ దర్శనమిస్తున్నాయేతప్ప వైసీపీ పాలనలో ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలన్నా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలన్నా రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ చూసినా అవినీతి, ఆరాచకాలు రాజ్యాన్నేలే విధంగా నూతన పాలనా విధానాన్ని రాష్ట్రానికి పరిచయం చేసిన వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. డ్రామాలు, నాటకాలు ప్రజలు కనిపెట్టేశారని, ఇక అటువంటి వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సీకే.హారూన్ రషీద్, పురిణి దేవరాజ్, నాటారు శీనయ్య, పుచ్చలపల్లి రవి, నాగరాజు, గాంధీ, వెంకట రమణయ్య, గంగపట్నం శీనయ్య, పుచ్చలపల్లి బాబు, పి.శీనయ్య తదితురులు పాల్గొన్నారు.



శంభునిపాలెంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

విష్ణు వర్గీయులు టీడీపీలో చేరిక

అల్లూరు, మే 7 : రాజకీయ ఊహ తెలిసిన నాటి నుంచి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో నడిచిన నాయకులు సోమవారం రాత్రి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. విష్ణు అనుచరవర్గంలో ప్రధాన మైనార్టీ నాయకుడైన షేక్ ఇస్మాయిల్ టీడీపీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆయనతోపాటు షేక్ అబ్దుల్ సమద్, ఎండీ.రసూల్ బాషా, షేక్ కరిముల్లా, షేక్ రఫీ, షేక్ మహబూబ్ బాషా, ఆర్.నారాయణరావు, షేక్.ఆబిద్, షేక్ గౌస్‌బాషా, షేక్ హఫీజ్, షేక్ ఖాసింసాహెబ్, షేక్ అబ్దుల్ ఖాదర్, అదేవిధంగా వినాయకనగర్‌లోని పల్లె కాపు సామాజికవర్గానికి చెందిన అప్పాడి సత్యనారాయణ, సతీష్, స్వాములు, గొల్లపోతు వెంకటేశ్వర్లుతోపాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, పాపనబోయిన రత్తయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, యేలూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీకి చెందిన పలువురు మంగళవారం టీడీపీలో చేరారు. వీరితోపాటు పురిణి పంచాయతీ నల్లచెరువు కట్టకు చెందిన ప్రజలు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన విష్ణు వర్గీయులు

ఆంధ్రజ్యోతి జన కేతనం

నిఘా నీడలో ఓటింగ్

- పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



నిఘా నేత్రం

ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసేలా ఈసీ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల్లో మంగళవారం నుంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల తెలంగాణలో ఎన్నికల సందర్భంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈసీ ప్రతి పోలింగ్ బూత్‌లో రెండేసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఒక కెమెరాను బూత్ బయట, మరో కెమెరాను బూత్ లోపల అమర్చుతున్నారు. కెమెరాలోనే మెమరీ, నెట్ సౌకర్యంతోపాటు రాత్రిళ్ల పనిచేసేలా లైట్లు కూడా అమర్చారు. మనుబోలు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు సమస్యాత్మక గ్రామాల్లో కూడా వీటిని ఏర్పాటు చేసేలా 89 సీసీ కెమెరాలను అమర్చనున్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారుగా 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సాంకేతిక సిబ్బంది తెలిపారు.

- మనుబోలు

రేపటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఎన్నికల దృష్ట్యా నిర్ణయం
- రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్
- ఇప్పటికే చార్జీలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జిల్లాకు తరలిరానున్నారు. పోలింగ్ తేదీ ఈనెల 13 సోమవారం రావడంతో ఎలాగో 12వతేదీ ఆదివారం సెలవు. ముందుగా 11వ తేదీ శనివారం రాత్రే వారంతా జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు శని, ఆదివారాలు సెలవు కావడంతో 10వతేదీ రాత్రే బయలుదేరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక ఓటేశాక 13వ తేదీ రాత్రి పలువురు తిరుగు ప్రయాణం అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా ఇప్పటికే హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రజలు బస్సుల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9,10,11 తేదీల్లో హైదరాబాదు నుంచి జిల్లాకు వచ్చేందుకు రోజుకు ఐదు చొప్పున ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ పూర్తిన వెంటనే అవసరాన్ని బట్టి ఎన్ని బస్సులు కావాలన్నా ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నామన్నారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ వారు ఇప్పటికే అధిక చార్జీలతో టికెట్ ధరలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలు, జరిమానా



ఎన్నికల పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తుపై సీరా, నీళ్ల పోయడం వంటి చర్యలు ఇందులో భాగామే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. పోలింగ్ సిబ్బంది ఇలాంటి చర్యలు పాల్పడితే ఐపీఎస్ 1951 సెక్షన్ 135ఏ 136 ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశ ముంది. ఇతరులు అయితే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు.

- ఉదయగిరి

నిజాయితీ గల నేతకే ఓటేస్తా..

యువగళం



ఈ ఎన్నికల్లో నేను మొట్టమొదటి సారిగా ఓటు వేయబోతున్నా. ప్రతి ఓటూ విలువైనదే. ప్రధానంగా యువత ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చూపడం వల్లే అవినీతి నాయకులు ఎన్నికల్లో గెలుస్తున్నారు. అందుకే అవినీతికి తావులేని నాయకుడికి ఓటు వేసి, నా మొదటి ఓటును సద్వినియోగం చేసుకుంటా.


-జే చౌదయ్య, సంగం

రొయ్యకూ బాదుడే!

ఆక్వా రంగంలో రాష్ట్రానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. దేశంలో చేపట్టే ఆక్వా ఎగుమతుల్లో ఆంధ్రా నుంచే 65 శాతం జరుగుతుంటాయని సెంట్రల్ కోస్టల్ ఆక్వా అథారిటీ పేర్కొంది. అయితే... ఇదంతా ఐదేళ్ల క్రితం మాట.

నేడు...

జగన్ ప్రభుత్వం విధానాల వల్ల ఆక్వా రంగం కుదేలైంది. ఐదేళ్ల క్రితం జిల్లాలో 50 వేల ఎకరాల్లో చేపట్టిన రొయ్యల పెంపకం నేడు 20 వేల ఎకరాల్లో కూడా లేదు. ఇందుకు సాగుకు పెరిగిన వ్యయం... తగ్గిన ఆదాయమే కారణమని రైతులు అంటున్నారు. దీనికితోడు విద్యుత్ చార్జీల రాయితీని ప్రభుత్వం ఎత్తేసింది. అంతేకాక రొయ్యల గుంటల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని నిబంధనలు పెట్టింది.



- భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- రాయితీలకూ మంగళం
- పెరిగిన సాగు వ్యయం... తగ్గుతున్న ఆదాయం
- పెంపకం చేపట్టలేమంటున్న సాగుదారులు
- ప్రోత్సాహమివ్వని వైసీపీ సర్కారు

అల్లూరు, మే 7 : ఎకరా వెనామీ సాగు చేపట్టాలంటే 100 కౌంట్ వ స్తేగానీ దిగుబడి వచ్చినట్టు కాదు. 100 కౌంట్ ధర కిలో రూ.210 ఉండడంతో ఎకరానికి అయ్యే వ్యయం మాత్రం రూ.2.50 లక్షలు అవుతోంది. ఇందులో రొయ్య పిల్లల ధర రూ.80 వేలు కాగా, అవి తినే మేత 2 నుంచి 3 టన్నులు ఉంటుంది. మేతకు రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ఇలా చూసుకుంటే రొయ్యల ధరలు పతనమ య్యాయని చెప్పుకోవచ్చు. ఐదేళ్ల క్రితం ధరలు నియంత్రణలో ఉండడంతో రైతులకు కిలోకు రూ.20 నుంచి రూ.30లు మిగులుతూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

పెరిగిన విద్యుత్ చార్జీలు

ఆక్వా రంగానికి ప్రధానవసతి విద్యుత్. ఇది ఖర్చుతో కూడుకున్నది. గతంలో యూనిట్‌కు రూ.2 ఉండగా, ప్రస్తుతం రెండు గ్రేడ్లుగా విభజించి ఆక్వా జోన్‌కు రూ.4.20, నాన్ ఆక్వా జోన్‌కు రూ.6.50 చెల్లించాల్సి వస్తున్నదని దీంతో రైతులపై చార్జీల భారం పడింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో చార్జీలపై రాయితీ ఉండేది. జగన్ ప్రభుత్వం దాన్ని ఎత్తేసింది.

సబ్సిడీలేవీ ?

రాష్ట్రంలో 2019కు ముందు ఆక్వా రైతులకు పూర్తిగా ప్రభుత్వ సహకారం ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీలు 50 శాతానికి పైగా ఉండేవి. ఎంపెడా అధికార సీఈఈ ధ్రువీకరణ పత్రం ఉన్న ఆక్వా రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఏరియేటర్లు, మోటార్లు 50 శాతం రాయితీతో ఇచ్చేవారు.దీంతో వారికి భారం తగ్గేది. అంతేకాక రుణాలు మంజూరు చేసేవారు. అయితే జగన్ ప్రభుత్వం ఏ ఒక్క విషయంలో కూడా ఆక్వా రైతులను ఆదుకున్న పాపాన పోలేదు. దీనికితోడు గుంటలను ఏర్పాటు చేయాలంటేనే లైసెన్సు ఉండాలంటూ నిబంధనలు పెట్టింది. ఇందుకు ఫిషరీస్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసి, వారికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్నది.

లీజుదారుల పరిస్థితి దయనీయం

ఆక్వా సాగు సాధారణంగా భూమి కలిగిన రైతుకే పెనుభారంగా మారగా, ఇక లీజుదారుల పరిస్థితి వర్ణనాతీతమే. లీజు మొత్తం ముందుగానే రైతులకు చెల్లించి రొయ్యల సాగు చేపట్టాల్సిన పరిస్థితి. ఎకరానికి 100 కౌంట్ రొయ్యల పెంపకం చేపట్టాలంటే రూ.2.5 లక్షలు ఖర్చవుతుండగా, లీజు దారులకు మాత్రం రూ.2.70 నుంచి రూ.3 లక్షల వరకు వ్యయం అవుతోంది. దీన్ని భరించి సాగు చేపట్టాలంటే భారంగా మారింది.



ఏమన్నా మిగులుతుందే మోననే...

పదేళ్లుగా రొయ్యల పెంపకం చేపడుతున్నా. 2019కు ముందు ఆక్వా రంగం ఆశాజనకంగా ఉండేది. నాలుగు రాళ్ల వెనకేసుకున్నా. 2019 తరువాత నుంచి వ్యయం భారీగా పెరిగిపోయింది. దీంతో ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోయాను. ఈ దఫా ఏమన్నా మిగులుతుందేమోననే ఆశతో సాగు చేపడుతున్నా.

- కత్తుల విజయ్‌కుమార్, ఆక్వారైతు



మేత ఖర్చులు భరించలేకున్నాం...

గతంతో పోల్చితే రొయ్యల మేతల ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. మేత అరువుకు తెచ్చుకోవాలంటే దిగుబడి అయిన రొయ్యలను వారు అడిగిన ధరకు వారికే విక్రయించాలి. తద్వారా ధరలో తగ్గుదల మేత ఖర్చులో పెరుగుదల కలిసి ఖర్చులకు సరిపోవడం లేదు.

- పాలెపు చిరంజీవి బాబు, ఆక్వారైతు

సాగుకు భారీ వ్యయం



ఆక్వా సాగులో 80 శాతం ఖర్చుపెడితే 20 శాతం ఆదాయం వచ్చేది. కానీ 2019 తరువాత నుంచి వ్యయం పెరిగింది. ఆదాయం తగ్గుముఖం పట్టడంతో 20 శాతం మిగలకపోగా, 25 శాతం అదనంగా చేతి నుంచి పెట్టాల్సి వస్తోంది. ఈ కారణంగా రొయ్యల సాగులో తీవ్రంగా నష్టపోయా.

- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వారైతు

కండువాలకు గిరాకీ !



వింజమూరులో వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ప్రస్తుతం కండువాలకున్న గిరాకీ అంతాఇంతా కాదు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల కండువాలకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు లక్షల్లో కండువాలను కొనుగోలు చేస్తున్నారు. ఏ చోటకు వెళ్లినా పెద్ద ఎత్తున కండువాలను తీసుకెళ్లి ఇతర పార్టీల నేతలను తమ పార్టీలో చేర్చుకునే సమయంలోనూ వారికి వేస్తున్నారు. అలాగే ప్రచార ర్యాలీలు, బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించేటప్పుడు కూడా కార్యకర్తలు కండువాలు వేసుకునే పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రధాన సామగ్రిగా కండువాలు పెట్టుకుని ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఈ కండువాలు ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.100లు పలుకుతున్నట్లు సమాచారం. దీంతో ఒక్కో అభ్యర్థికి కండువాలకే రూ.50 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం.

- ఉదయగిరి రూరల్

చేపా.. చేపా... ఎక్కడ ?

- నిషేధిత అలివి వలలతో వేట
- సోమశిలలో అంతరిస్తోన్న మత్స్యసంపద
- ఉత్పత్తిపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- వేట లేక జాలర్ల ఇక్కట్లు



సోమశిల జలాశయంలో అడుగంటిన నీటిమట్టం

అనంతసాగరం, మే 7: అపార మత్స్యసంపదకు నిలయంగా ఉన్న సోమశిల జలాశయంలో నేడు చేపల జాడే కనిపించడం లేదు. దీంతో డ్యామ్‌పై ఆధారపడి జీవిస్తున్న జాలర్ల జీవనం అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత జలాశయం నీటిమట్టం అడుగంటి 8 టీఎంసీలకు పడిపోయింది. ఈక్రమంలో ఆశాజనకంగా చేపలవేట ఉండాలి. అయితే జలాశయంలో వేటకు వెళ్లిన జాలర్లకు చేప దొరకడం లేదు. ఈ పరిస్థితి వారిని ఆందోళనకు గురిచేస్తున్నది. జలాశయం పరిధిలో సుమారు 400 మంది లైసెన్సు కలిగిన జాలర్లు ఉన్నారు. వీరంతా రోజువారీ వేటకు వెళ్లి రూ.500 నుంచి రూ.1500 వరకు సంపాదించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా వేట సాగక జాలర్ల ఆందోళన చెందుతున్నారు.

- **ప్రధాన కారణాలు ఇవే..**

స్థానికంగా కొంతమంది వ్యాపారులు మాఫియాగా ఏర్పడి నిషేధిత అలివి వలలతో వేట సాగిస్తున్నారు. చిన్నాపెద్దా చేపలను ఒడ్డుకు లాగేసి చేపల ఉత్పత్తికి గండి కొడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపల సంతానం తగ్గి వేటసాగని పరిస్థితి దాపురించింది. ఈ మత్స్య మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు గతంలో ఉన్నతాధికారులకు జాలర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు.

- **పెంపకంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం**

ఇదిలా ఉండగా చేపల ఉత్పత్తి పెంచేలా వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. గత టీడీపీ హయాంలో మీనోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో లభించే మూస, ఎర్రగండి, నల్లగండి చేపపిల్లను తెచ్చి జలాశయంలో వదిలేవారు. మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుత వైపీపీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడం లేదు. ఈ నాలుగేళ్లలో ఒక్కసారి కూడా జలాశయంలో చేపపిల్లలను వదిలిన దాఖ లాలు లేవు. ఈకారణాలతో నేడు డ్యామ్‌లో చేపల ఉత్పత్తి తగ్గి, వేట జరగని దుస్థితి నెలకొన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో బాగా వేట జరిగితే సుమారు 10 టన్నుల చేపలు సోమశిల నుంచి కోల్‌కతా, చెన్నై, పూణే లకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం రెండు టన్నుల కూడా ఎగుమతి కావడం లేదు.

అలివి వలల వల్లే ఈ పరిస్థితి



జలాశయంలో నిషేధిత అలివి వలల వేట వల్లే నేడు ఉత్పత్తి తగ్గి వేట సాగడం లేదు. ఈ అక్రమ వేటను అడ్డుకొని ఉంటే ఈపరిస్థితి ఉండేది కాదు.

- వై సుబ్బారావు, జాలరి సోమశిల

నీరు తగ్గినా చేప దొరకడం లేదు..




జలాశయం నీటి మట్టం పూర్తిగా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో వలకు చేపలు దండిగా పడాలి. అయితే జలాశయంలో వేటకు వెళితే శ్రమ తప్ప ఎలాంటి ఫలితం లేకుండా ఉంది.

- ప్రసన్నకుమార్, మత్స్యకారుడు, సోమశిల

ఖాళీ లేదు.. బ్రదర్ !

ఎట్టెట్టా



పో... పోవయ్యా... ఎన్నికలయ్యేదాకా ఈ నాల్రోజులు కుదరంటే కుదరదు !

ఏం తమ్ముడూ... రేపు పనుంది వస్తావా... ? అని అడిగితే ఎవరూ ముందుకు రావడంలేదు. ఖాళీలేదు బ్రదర్ .. వారం రోజుల వరకు అడగొద్దు... మాకూ పని ఉంది... అనే మాటలు ప్రస్తుతం గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కూలీలంతా బిజీ అయిపోయారు. ఎన్నికల వేళ వారికి చేతినిండా పని దొరికింది. ప్రచారంలో తిరుగుతూ రోజుకూలి సంపాదించుకుం టున్నారు. పనికెళితే ఏం వస్తుంది...? ఎండలో మాడిపోవడం తప్ప.. అనుకుంటూ ప్రచారానికి వెళుతున్నారు. రోజూ రూ.500, మద్యం సీసా ఇచ్చి, భోజనం కూడా పెడుతున్నారు. ఎండలకు కార్యకర్తలు ఎవరూ పెద్దగా రాకపోవడంతో ఇలా కూలీలను తీసుకువెళుతున్నారు. వీరే ఓ ఊరిలో ఓ పార్టీలో.. మరో ఊరిలో మరో పార్టీలో కనిపిస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.

- ఉదయగిరి

మాటకు కట్టుబడేవారు..



నాటి జ్ఞాపకం

గతంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేవారు. ఇప్పటి ఎన్నికల్లో మాదిరిగా భయాలు, ఆందోళనలు ఉండేవికావు. నాయకులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవారు. గ్రామంలోని ఓ నాయకుడి వెంటే అందరూ నడిచేవాళ్లు. ఇప్పటిలాగా పార్టీల ఫిరాయింపులు ఉండేవికావు. గతంలో ఓటు వేసేందుకు ఐదారు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. అప్పుడు అభ్యర్థులు చేసిన, చేయబోతున్న పనులు చెప్పేవారు కాదు. ఇప్పుడు నేతలంతా అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని గొప్పలు చెప్పుకుంటున్నారు.

- ఎం. సుబ్బయ్య, (90), జంగాలకండ్రిక, సంగం మండలం

ప్రచారాల హోరు.. నాయకుల జోరు !

నాటి మెండు

ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఎన్నికల వేడి ప్రజలకు ఊపిరాడనివ్వడంలేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి, సాయంత్రం మరో పార్టీ అభ్యర్థి.. ఇలా ఒకరి వెంట మరొకరు ప్రచారానికి వస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికితోడు రోజంతా ప్రచార రథాల మైకుల హోరుతో చెవులు చిల్లులు పడుతున్నాయి. చిన్న చిన్న గ్రామాలకు ఉదయం పూట, పెద్ద గ్రామాలకు సాయంత్రం వేళలో నేతలు ప్రచారానికి వస్తున్నారు. కందుకూరు నియోజకవర్గానికి అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఇద్దరూ కొత్తవారే అయినా, తమకు ఓ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇక ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అలాగే ఓవైపు మేనిఫెస్టో అంశాలను ప్రస్తావి స్తూనే...మరో వైపు స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. మొత్తానికి గ్రామాల్లో రాజకీయ సందడి జోరుగా కనిపిస్తోంది.

- పలేటివారిపాలెం



కోవూరు సర్వేపల్లి

- భారీ మెజారిటీతో గెలుపు నాదే
- సానుభూతి..కూటమి బలం..కాకాణి అకృత్యాలే నన్ను గెలిపిస్తున్నాయి
- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఈసారి సర్వేపల్లి ప్రజలు
నన్ను దీవిస్తారు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ మీద ఉన్న వ్యతిరేకత.. ముఖ్యంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అకృత్యాలే ఈ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తాయి. ప్రజాదీవెనలు నాకు బలంగా ఉన్నాయి." అని సర్వేపల్లి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపునకు బాటలు వేసే అవకాశాలు.. గెలిచిన అనంతరం నియోజకవర్గ ప్రజలకు చేసే సేవల గురించి ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు.

? మీ గెలుపు అవకాశాలు ఎలా

! ఈసారి సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. గెలుపు నాదే. సర్వేపల్లిలో కాకాణి కథ ముగిసిపోయింది. వైసీపీ నుంచి రోజు రోజుకు పెరుగుతున్న వలసలే ఇందుకు నిదర్శనం. సర్వేపల్లి ప్రజల చల్లని దీవెనలతో భారీ మెజారిటీతో గెలుస్తున్నాను. ఇందులో తిరుగేలేదు.

? గెలుపునకు అనుకూలించే అంశాలు

! నెంబర్ 1: సర్వేపల్లి ప్రజలకు నా పట్ల ఉన్న సాను భూతి. గెలుపు, ఓటములతో పనిలేకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నా. ప్రతి సమస్యపై పోరాడుతూనే ఉన్నా. ఉదయగిరి బలవన్మరణం కేసు కావచ్చు, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ సమస్య కావచ్చు. కాకాణి అక్రమాలు, అవినీతి మీద కావచ్చు, దానివల్ల నష్టపోయిన వారి వైపు నుంచి కావచ్చు. సర్వేపల్లి ప్రజల్లో ఎవరికి ఏ అన్యాయం జరిగిందని తెలిసినా అండగా నిలబడుతున్నా. తెగించి పోరాడుతున్నా. ఇవి చూసి అయ్యో పాపం.. మన కోసం ఇంతగా తాపత్రయపడే మనిషిని పోగొట్టుకున్నామే అనే సానుభూతి పార్టీలకు అతీతంగా అత్యధికుల్లో ఉంది. ప్రజలు చూపే ఆ సానుభూతే శ్రీరామ రక్షగా నన్ను గెలిపిస్తుంది.

● నెం.2 : కాకాణి, అండ్ టీమ్ మీద వ్యతిరేకత. ఎన్ని అక్రమాలు చేశారో ప్రజలు లెక్క కట్టుకున్నారు. అన్నింటికి ఓటు రూపంలో బదులిచ్చే తీరుతారు. సర్వేపల్లిలో కాకాణి చేసినన్ని అరాచకాలు, అక్రమాలు, అవినీతి రాష్ట్రంలో మరెక్కడా జరిగుండదు. కొండలు, చెరువులు తినేశాడు. ప్రజల మీద అక్రమ కేసులు పెట్టి వేధించాడు. బ్లాక్‌మెయిల్ చేశాడు. హింసకు గురిచేశాడు. ఈ పాపాలన్నీ నాకు వరాలుగా మారబోతున్నాయి. కాకాణి మీద కసి తీర్చుకునే క్రమంలో నన్ను ఆశీర్వదించనున్నారు.

● నెం 3 : కూటమి బలం. ఈ కూటమి రాష్ట్ర భవిష్యత్తుకు అవసరం అని ప్రజలు గుర్తించారు. అప్పులపాలైన రాష్ట్రం గట్టెక్కాలంటే కేంద్రం సపోర్టు అవసరం అనే విషయం ప్రజలకు అర్థమైంది. అందుకే మతాలకు అతీతంగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమిని ప్రజలు స్వాగతిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే సరైనదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

● నెం.4 : విశేషమేమంటే ఈ ఎన్నికలను ప్రజలే జరిపిస్తున్నారు. వైసీపీ పాలన పట్ల అంతలా విరక్తి చెందారు. ఎదురు మాట్లాడితే కేసు. చేసే అన్యాయాలకు, అక్రమాలకు వంత పలకకున్నా కేసు. అమాయకులపై కేసులు పెట్టారు. ఐదేళ్ళ పాటు సర్వేపల్లిలో పోలీసు పెత్తనమే నడిచింది. పోలీసు లాఠీ రాజ్యమేలింది. విధిలేక ఇంత కాలం కాకాణి అరాచకాలను ప్రజలు భరించారు. ఇప్పుడు ఇది ప్రజల టైమ్. కాకాణికి సినిమా చూపించాలని, రాక్షస పాలనను అంతం చేయాలని పార్టీ క్యాడర్ కన్నా ప్రజలే ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు.



? గెలిస్తే మీరేమి చేస్తారు

! నియోజకవర్గ ప్రజలకు శాంతిభద్రతలు కల్పిస్తా. పేదలు, రైతులకు అన్నివిధాలా అండగా ఉంటా. నా హయాంలో మొదలు పెట్టి అర్థంతరంగా ఆగిపోయిన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా. కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ సాధించి తీరుతా. పోర్టు పరిసరాల్లో మరిన్ని పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తా. ఎస్టీల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతా. వారి కాలనీలను అభివృద్ధి చేస్తా. ల్యాండ్ మాఫియా, శ్యాండ్, గ్రావెల్, క్వార్ట్జ్ మాఫియాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి దోషులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా.

పేదల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం : సోమిరెడ్డి



ముత్తుకూరు: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి

ముత్తుకూరు, మే 7: పేద ప్రజల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం కోసం మంగళ వారం కృష్ణపట్నంలో పర్యటించిన సోమిరెడ్డికి స్థానిక నాయకులు ఏకొల్లు కోదండయ్య, మామిడాల శ్రీనివాసులు, రాగాల శివకృష్ణ ఆధ్వర్యంలో యువకులు ఘనంగా స్వాగతం పలికారు. సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా కృష్ణపట్నం పసుపుమయంగా మారింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకునేందుకు చంద్రన్న బీమాను రెట్టింపు చేశారన్నారు. గెలిచినా ఓడినా ప్రజల మధ్య ఉంటూ ఎల్లప్పుడూ సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే పనిచేశానన్నారు. కాకాణిలా దోచుకోవడం, అక్రమ కేసులతో ప్రజలను వేధించడం చేయలేదన్నారు. వైసీపీ నాయకులు దోచుకున్న ప్రతి పైసాను తాము అధికారంలోకి రాగానే కక్కిస్తామన్నారు. స్థానికులకు ఉద్యోగాల కల్పన, కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు జంగాలకండ్రిగలో ప్రత్యేక పూల అలంకరణతో చేసిన ప్రచార రథంపై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బాబిరెడ్డి, మల్లికార్జునయాదవ్, మునిరెడి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటేయండి

పొదలకూరు : నాన్ డెల్టాను కండలేరు, సోమశిల దక్షిణ కాలువతో డెల్టాగా మార్చానని... రెండు నిమిషాలు ఆలోచించి సైకిల్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చెన్నారెడ్డిపల్లి, డేగపూడి గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

47 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెంకటాచలం: ఈ నెల 13న జరిగే ఎన్ని కల నేపథ్యంలో గ్రామాల్లో ఏజెంట్లు దొరకని స్థితికి వైసీపీ దిగజారి పోయిందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. వేదాయపాళెంలో ఉన్న కార్యాలయంలో మంగళవా రం మండలంలోని తాటిపర్తిపాళెం, ఇస్లాంపేట గ్రామాలకు చెందిన 47 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

● మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అరాచకాలు, అక్రమాలతో విసుగెత్తిపోయిన సర్వేపల్లి ప్రజలు మే 13న జరిగే ఎన్నికల్లో కాకాణిని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి తెలిపారు. మండలంలోని గొలగమూడిలో ఆమె మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించి సోమిరెడ్డిని గెలిపించాలని కోరారు.

● పొదలకూరు: మండలంలోని బ్రహ్మగిరిపట్నంలో మంగళవారం టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే సునీల్‌కుమార్, పెంచలయ్య, అంజి, పాల్గొన్నారు.

మూడు పార్టీల కలయికతో ప్రగతి సాధ్యం

బీజేపీ, టీడీపీ, జనసేన కలయికతోనే రాష్ట్రం వేగంగా ప్రగతి సాధించగలుగుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు రాచపూటి ధనుంజయరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీనగర్ మూడు వీధుల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, ఆదాల సుగుణమ్మ, పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ టీడీపీ, బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు కొణతం రఘుబాబు, పాకం వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు

కోవూరులో ఊపందుకున్న ప్రచారం

కోవూరు మే 7 : పార్లమెంటు, శాసనసభ టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి దంపతుల గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కోవూరు, పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు గ్రామాల్లో మంగళవారం టీడీపీ, జనసేన , బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేశారు. స్థానిక సత్రం వీధిలో టీడీపీ నాయకులు నిమ్మల శ్రీనివాసులు, యేనేటి నిరంజన్, కుడుమల శివకుమార్ నాయకత్వంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. పోతిరెడ్డిపాళెంలో మాజీ సర్పంచు తిరుమూరు వాణి, అశోక్‌రెడ్డి నాయకత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. పడుగుపాడులో చెంబేటి పెంచలయ్య, నూరిశెట్టిశ్రీనివాసులు, ఆవుల శ్రీనివాసులు, గంగవరం రవిచంద్ర, పఠాన్ నజీర్‌బాష నాయకత్వంలో వేర్వేరుగా ప్రచారం చేసి వేమిరెడ్డి దంపతుల్ని గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు.

మూడో రోజు 260 ఓట్లు పోల్

వెంకటాచలం, మే 7: సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వెంకటాచలంలోని క్యూబా ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ రోజు మంగళవారం 260 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ రూపంలో వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 1268 ఓట్లు ఉండగా తొలిరోజు 387, రెండో రోజు 608, మూడవ రోజు 260 కలిపి మొత్తం 1255 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 13 మంది వినియోగించుకోవాల్సి ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 7: బుచ్చిరెడ్డిపాళెంలోని గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పార్కు ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతుడు యాచకుడిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

మనుబోలు, మే 7: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై మనుబోలు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నా యి. 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆనవాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్, ఫీల్డ్ అసిస్టెంట్

తోటపల్లిగూడూరు, మే 7 : మండలంలోని చింతోపు గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీర్ ఏల్లూరు వెంకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బుర్రి కృష్ణయ్య, ఆ గ్రామ సర్పంచ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీకి ఓటు వేయాలంటూ సోమవారం రాత్రి ఇంటింటా ప్రచారం చేశారు.

సోమశిలలో 8.012 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 7: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. మంగళవారానికి జలాశయంలో 8.012 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

సంగం, మే 7: అనసూయనగర్ గ్రామానికి చెందిన అత్తిపాటి రవి (40) గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు వ్యవసాయ పనులు చేసుకుని జీవించే ఈయన సోమవారం రాత్రి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు ఓటు హక్కుపై ఫిర్యాదు

కలువాయి, మే 7: మండలంలోని దాచూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 41వ నెంబరు పోలింగ్ కేంద్రం సంబంధించిన ఓటర్ల జాబితాలో పలువురి మైనర్ల పేర్లు ఉన్నాయని మంగళవారం గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు. ఆధార్‌కార్డుల్లో పుట్టిన తేదీలను మార్ఫింగ్ చేసి నకిలీ పత్రాలు సమర్పించి వారు ఓటుహక్కు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దారు సంజీవకుమారిని వివరణ కోరగా ఈ విషయమై తమకు అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో విచారణ జరిపిస్తానని చెప్పారు.

వడదెబ్బకు జొన్నవాడ మాజీ సర్పంచు మృతి



జొన్నవాడ మాజీ సర్పంచు పుట్టా బుజ్జమ్మ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, మే 7: మండలంలోని జొన్నవాడ గ్రామ మాజీ సర్పంచు పుట్టా (కోవూరు) బుజ్జమ్మ (79) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందింది. గత కొన్ని రోజులుగా విపరీతంగా కాస్తున్న మండుటెండలకు తట్టుకోలేక వడదెబ్బతో గత రెండురోజులుగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు మృతురాలి బంధువులు తెలిపారు.

మహిళ గౌరవ భంగం కేసులో నిందితుడికి జైలుశిక్ష

ముత్తుకూరు, మే 7: మహిళ గౌరవ భంగం కేసులో నిందితునికి జైలుశిక్ష విధించినట్లు ముత్తుకూరు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాళ్లపూడి గ్రామంలో ఏప్రిల్ 25వ తేదీన ఒక మహిళ కల్లు అమ్ముతుండగా అల్లంపాటి సుబ్రహ్మణ్యం వచ్చి డబ్బులు ఇవ్వకుండా కల్లు పొయ్యమని అడిగాడు. అందుకు సదరు మహిళ నిరాకరించినందుకు ఆమె చెయ్యి పట్టుకుని లాగి అవమానపరిచాడు. దీంతో ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో సుబ్రహ్మణ్యంపై కేసు నమోదుచేసి తగిన సాక్ష్యాలు పొందుపరచగా, ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో నెల్లూరు రైల్వే కోర్టు జడ్జి వినోద్ నిందితుడు అల్లంపాటి సుబ్రహ్మణ్యంకి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యను దారుణంగా చంపిన భర్త

- కత్తితో నరికి.. సుత్తితో మోది హత్య
- కేసు రాజీకి పలుమార్లు బెదిరింపులు
- కుమారుడ్ని ఇవ్వాలని ప్రాధేయపడిన భార్య



అమల (ఫైల్)

నెల్లూరు(క్రైం). మే 7: కంటికి రెప్పలా కాపాడాల్సిన భర్తే.. భార్యను దారుణంగా హత్య చేశాడు. రాత్రి భర్త దాడి నుంచి తప్పించుకుని వెళ్లిన భార్య ఉదయం ఇంటికి చేరు కోగా, ఇంట్లో దాక్కొని ఒక్కసారిగా కత్తితో నరికి, సుత్తితో తలపై మోది హత్య చేశాడు. కత్తి, సుత్తిలను చేత్తో పట్టుకొని నేను చంపేశా... అం టూ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కోవూరు షుగర్‌ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన పీ అమల(37)కు గతంలోనే వివాహం జరిగింది. ఆమెకు ప్రవీణ్ అనే కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె భర్త నుంచి విడాకులు తీసుకొని, కుమారుడితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో బాలాజీ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ కే మునిరత్నంకు ఐదేళ్ల క్రితం అమలను ఇచ్చి పెద్దలు రెండో వివాహం చేశారు. అమలకు రెండో సంతానంగా యోగేష్ జన్మించాడు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగినా ఆ తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వారు విడిపోయారు. అమల తన మెదటి కుమారుడితో కలిసి భగత్‌సింగ్‌కానీలో నివాసం ఉంటోంది. మునిరత్నం తన కుమారుడు యోగేష్‌తో కలిసి బాలాజీనగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో అమల భర్తపై వరకట్నపు వేధింపుల కేసు పెట్టింది. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. తన రెండో కుమారుడిని ఇవ్వాలని అమల భర్తను పదేపదే ప్రాధేయపడింది. తనపై పెట్టిన కేసు రాజీ చేసుకుంటే కుమారుడిని ఇస్తానని మునిరత్నం చెప్పేవాడు. ఈ క్రమంలో అప్పుడప్పుడు మునిరత్నం భార్య వద్దకు వచ్చి కేసు రాజీ చేసుకోవాలని కోరేవాడు. అంతేకాక నీకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందని కూడా గొడవ పెట్టుకునేవాడు. కేసు రాజీ పడకుంటే చంపేస్తానని పలుమార్లు బెదిరించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆయన భార్య వద్దకు వచ్చి చంపేందుకు యత్నించాడు. దీంతో అమల తన కుమారుడితో కలిసి ఇంట్లో నుంచి పారిపోయి భగత్‌సింగ్ కాలనీలోని శ్రీరాంవెల్డింగ్ షాపులో రాత్రంతా ఉండి ఉదయం ఇంటికి వెళ్లింది. అప్పటికే ఇంట్లో దాక్కొని ఉన్న మునిరత్నం ఆమెపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. సుత్తితో బలంగా తలపై మోదాడు. అమల పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లగా మునిరత్నం కత్తి, సుత్తి చేతిలో పట్టుకొని.. దాన్ని నేనే చంపేశాను .. అంటూ బయటకు వచ్చాడు. వారు లోపలికి వెళ్లి చూడగా అమల రక్తపు మడుగులో పడి చనిపోయి ఉంది. దీంతో వారు జరిగిన విషయాన్ని స్థానిక వీఆర్‌వో శ్రీదేవికి తెలియజేశారు. ఆమె నవాబుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం బాబి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్ మార్చురీకు తరలించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ బాబి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, మే 7: కావలి మండలం అడవిలక్ష్మీపురం రైల్వే గేటుకు సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి స్థానికుల సహాయంతో రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల కథనం మేరకు... రైల్వే గేటుకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటన సుమారు 7 నుంచి 10 రోజుల క్రితం జరిగి ఉండడంతో మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతూ గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతుడు 5.6 ఎత్తు కలిగి సిమెంట్ కలర్ పొడవు చేతుల చొక్కా, డ్రాయర్ ధరించి ఉన్నాడు. అంతకుమించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాటూరి శ్రీనివాసరావు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6814
వెండి కిలో ధర	రూ. 84,000
వెండి ఒక గ్రాము	రూ. 86.00

దేశాభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యం : చింతా

ముత్తుకూరు, మే 7 : దేశాభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. మంగళవారం ముత్తుకూరులో కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి పూల చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన తమను గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

ఇందుకూరుపేట, మే 7: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం అని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆశ్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్, గంపల మంజుల, నాగభూషణ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ప్రశాంతిరెడ్డి



కొడవలూరు : ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: ఎన్నికల ప్రచారం చేస్తున్న ఐషితారెడ్డి

కొడవలూరు, మే 7: నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో పెమ్మారెడ్డిపాలెం, వెంకన్నపురం, బసవాయపాలెం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అయన ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందనున్నారన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో ప్రజలను దోచుకున్న అరాచక శక్తులను తరిమికొట్టాలని కోరారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ప్రజలు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు జీవీఎన్ శేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని కేవీఆర్ విజయ్ పర్యవేక్షించగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కే విజయ్ కుమార్‌రెడ్డి, సూర్య, కోడూరు బుజ్జిరెడ్డి, కోడూరు సుధాకర్‌రెడ్డి, గోపాల్, సురేష్, సతీష్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏం చేశావ్ ?

బుచ్చిరెడ్డిపాళెం : ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఏమి చేశావని, కనీసం గుడపల్లి కాలువల్లో పూడిక తీయించలేదని ప్రసన్నపై కోవూరు ఎన్డీఏ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 5, 7, 8, 9 వార్డుల్లో ఇన్‌చార్జ్‌లు బచ్చాబాయ్, ఎస్‌కే పర్వీన్, షబ్బీర్, వింజం రామానాయుడు, వింజం మహేష్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఎంపీ శేషయ్య, హరికృష్ణ, సూరా శ్రీనివాసులురెడ్డి, సర్దార్, హరనాథ్, శివ పలు వార్డుల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగిన వైసీపీ శ్రేణులు

శాంతినగర్‌లో టీడీపీ ప్రచారం జరుగుతుండగా వైసీపీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి వైసీపీ నాయకులు అడ్డుకుని ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసే పరిస్థితి నెలకొనడంతో టీడీపీ వర్గీయులే సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

● వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ కోడలు ఐషితారెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలోని 14, 15 వార్డుల్లో నాయకులు చెంబేటి ప్రసాద్, ఆర్‌కే రవి, వి సుధీర్ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో ఎన్నికల ప్రచారం చేశారు. చెన్నూరు రోడ్డులోని మోహన్‌బాబు ఆసుపత్రి దగ్గర్నుంచి గిరిజాహాల్ కూడలి వరకు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రచారాన్ని అడ్డుకున్న అధికారులు

కాగా, ఐషితా రెడ్డి గిరిజా హాల్ కూడలి వరకు ప్రచారం చేసి వెళ్ళిపోయారు. కొంతసేపటికి ప్రచారాన్ని కొనసాగిస్తున్న టీడీపీ నాయకులను అధికారులు అడ్డుకుని అను మతులున్నాయా అని ప్రశ్నించారు. అనుమతులు అభ్యర్థులు తీసుకున్నారని చెప్పడంతో గుం పులుగా జెండాలు పట్టుకుని ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో నాయకులు ప్రచారాన్ని ముగించి వెళ్ళిపోయారు. కాగా, టీడీపీ ప్రచారాన్ని అడ్డుకున్న ఎన్నికల అధికారులు బస్టాండ్ సెంటర్లో వైసీపీ నాయకులు చేసిన ప్రచారాన్ని పట్టించుకోకుండానే వెళ్ళిపోవడంపై విమర్శలకు తావిచ్చింది.

● మండలంలోని రేబాలలో మంగళవారం రజక సంఘం నాయకులు వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో రజకసంఘం నేతలు వల్లూరు శ్రీనివాసులు, గంజం రాఘవేంద్రరావు, పాల్గొన్నారు.

● కొడవలూరు: వేమిరెడ్డి దంపతులతోనే పేదల సంక్షేమం అని ప్రశాంతిరెడ్డి కూతురు నీలిమారెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాలెంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఇరువూరి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూతురు నీలిమారెడ్డి, కోడలు ఇషితారెడ్డి పాల్గొన్నారు.

● టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని గౌడసంఘం జిల్లా నాయకుడు దాసరి విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చలివేంద్రంలో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కూటమి అభ్యర్థులుగా పోటీచేస్తున్న వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు.

ఉమ్మడి పార్టీల నేతల ప్రచారం

విడవలూరు: వేమిరెడ్డి దంపతులను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ మంగళవారం టీడీపీ, బిజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విడవలూరులో ప్రచారం నిర్వహించారు.

●ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు పంచాయతీ బీసీ కాలనీ, గిరిజన కాలనీలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, తాండ్ర శ్రీనివాసులు, నర్రంబాక పరమేష్, పొలయ్య, రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

టీడీపీ పాలనలో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత

● నగర అభ్యర్థి పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర



ఎన్నికల ప్రచారంలో డాక్టర్ సింధూర

నెల్లూరు (విద్య), మే 7 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో వెనుకబడిన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర తెలిపారు. నగరంలోని 3వ డివిజన్‌లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు పెద్ద పీట వేస్తారన్నారు. వారి సంక్షేమం కోసం రూ.1,50,000కోట్ల రక్షణ నిధిని ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్, మత్స్యకారులకు వేటలేని సమయంలో రూ.20 వేల సహాయం, నాయిబ్రాహ్మణుల సంక్షేమం, దోభీఘాట్ల నిర్మాణం, నెల్లూరును స్మార్ట్‌సిటీగా చేయడం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతు న్నారని చెప్పారు. మరో నెల రోజుల్లో ప్రజల కష్టాలన్నీ తీరిపోనున్నాయని తెలిపారు. ప్రజలంతా కూడా టీడీపీకి అండగా ఉండి మే 13న జరిగే ఎన్నికల్లో నారాయణను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 47వ డివిజన్‌లోనూ సింధూర పర్యటించారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన మూడునెలల్లో ప్రజల కలలన్నీ నెరవేరుతాయని చెప్పారు. ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు పొత్తూరు శైలజ, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చంద్రబాబు పాలనలో అగ్రస్థానం

రానున్న టీడీపీ ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలవనుందని పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. నగరం లోని 6వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి మారుపేరైన నారాయణ గతంలో చేసిన అభివృద్ధికి నేడు ప్రజలు అపూర్వస్వాగతం పలుకుతున్నారన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయన్నారు. ప్రజలంతా తమకు పూర్తిగా అండగా ఉండి రానున్న ఎన్నికల్లో నారాయణను నగర ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

● మహిళలకోసం ప్రత్యేక పథకాలు...

రాష్ట్రంలోని మహిళల కోసం, వారి అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించారని నారాయణ కుమార్తె పొంగూరు శరణి తెలిపారు. నగరంలోని 47వ డివిజన్‌లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు జగన్ ప్రభుత్వంతో అన్ని రకాలుగా ఇబ్బందులుపడి విసిగిపోయారన్నారు. ప్రజల ఇబ్బందులను తప్పించడానికి చంద్రబాబు మేనిఫెస్టోలో అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళల సాధికారత కోసం నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ఏడాదికి మూడు సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి నారాయణను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



వృద్ధుడికి సూపర్‌సిక్స్ పథకాలను వివరించి ఓటు అభ్యర్థిస్తున్న నారాయణ కుమార్తె శరణి

ఇంటింట మద్యం



● నెల్లూరు రూరల్లో ఏరులై పారుతున్న లిక్కర్ ● గ్రామానికి పదికిపైనే బెల్టు షాపులు
● కట్టడి పట్టని సెబ్ అధికారులు ● బెల్టు, బైండోవర్ల పేరిట విచ్చలవిడిగా వసూళ్లు..?

నెల్లూరు రూరల్ మండలంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలియదుకానీ.. మద్యం మాత్రం పుష్కలంగా అందుతోంది. ప్రతి గ్రామంలో పదికి తగ్గకుండా బెల్టు షాపులు నడుస్తున్నాయి. లైసెన్సుడ్ షాపుల్లో టార్గెట్ ప్రకారమే లిక్కరు విక్రయాలు జరగాలని ఎన్నికల సంఘం ఆంక్షలు విధించడంతో దాదాపుగా షాపులన్నీ మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. మిగిలిన సమయంలో బెల్టు షాపులే మందుబాబులకు దిక్కవుతున్నా యి. దీంతో అక్రమ వ్యాపారులు అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. పల్లెల్లో బహిరంగంగానే ఈ తంతు జరుగుతున్నా నిలువరించా ల్సిన స్పెషల్ ఎన్‌ఫోర్సు మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మద్యం ఏరులై పారుతోందన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. కాగా, బెల్టు షాపులు, బైండోవర్ల పేరిట సెబ్ అధికారులు, సిబ్బంది విచ్చలవిడిగా దండకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెల్లూరు రూరల్, మే 7 : మద్యాన్ని నిలువరిస్తే గానీ గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరగవని భావించిన ఎన్నికల సంఘం ప్రభుత్వ వైన్ షాపులకు రోజువారీ టార్గెట్ల విధించింది. ఆ లక్ష్యాన్ని దాటి అమ్మకాలు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో మధ్యాహ్నానికే లక్ష్యం పూర్తి చేసుకుంటున్న షాపుల్లోని సిబ్బంది, ఆ తర్వాత దుకాణాలు మూతేసి వెళ్లిపోతున్నారు. మిగిలిన సమయంలో ఎక్కడా మద్యం లభించకపోవడంతో ఈ అవకాశాన్ని కొందరు సైడ్ బిజినెస్‌గా వాడుకుంటున్నారు. గతంతో పోల్చితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత నెల్లూరు రూరల్లో బెల్టు షాపుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి గ్రామంలో పదికి పైగా బెల్టు షాపులు వెలిశాయి. ప్రభుత్వం వైన్ షాపుల్లోని సిబ్బందిని తమకు అనుకూలంగా మలుచుకుని పెద్ద మొత్తంలో మద్యాన్ని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడిన తరువాత తెరుచుకుంటున్న బెల్టు షాపులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నాయి. దీనికితోడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కొందరు నాయకులు మద్యం పంపిణీ చేస్తుండగా, మరికొన్ని చోట్ల డబ్బు పంచుతున్నారు. మద్యం ప్రియులు ఆ నగదుతో లిక్కర్ కొనుక్కుని మత్తులో మునిగితేలుతున్నారు.

ఎంఆర్పీపై రూ. 100 వరకు అదనం

ప్రభుత్వ మద్యం షాపుల్లో లభించే వివిధ బ్రాండ్ల లిక్కర్‌ను బెల్టు షాపుల్లో ఎంఆర్పీ కంటే రూ.100 వరకు అదనంగా రేటు పెంచి విక్రయిస్తున్నారు. బ్రాండ్లనుబట్టి అదనపు ధర నిర్ణయిస్తున్న బెల్టు నిర్వాహకులు ఈ వ్యాపారంలో రోజుకు వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మొబైల్ బెల్టు షాపులను కూడా నిర్వహిస్తుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రబీ వ్యవసాయ సీజన్ ముగిశాక ఎడగారు సేద్యం లేకపోవడంతో పంట పొలాలన్నీ ఖాళీ అయ్యాయి. అటువంటి భూముల్లో పేకాట, కోడిపందేలకు స్థావరాలను ఏర్పాటు చేసుకుని జోరుగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని బెల్టు దుకాణదారులు జూదరులకు అవరమైన మద్యాన్ని వాహనాల్లో తీసుకెళ్లి అక్కడే అందిస్తున్నారు. ఈ తంతు సౌత్‌మోపూరు, కందమూరు, వెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు, ఆమంచర్ల, దొంతాలి, మన్నవరప్పాడు తదితర అటవీ భూములున్న గ్రామాల్లో జోరుగా సాగుతోంది.



చిల్లర దుకాణంలో మద్యం (ఫైల్)

షాపుకింత... బైండోవరుకింత...

నెల్లూరు రూరల్లో మద్యం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే సెబ్ అధికారులకు వచ్చే ఆదాయమే ఎక్కువనే విమర్శలున్నాయి. గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయనే విషయం సెబ్ అధికారులకు తెలిసినప్పటికీ, తెలియనట్లు వ్యవహరిస్తున్న వీరు షాపుల నిర్వాహకుల నుంచి మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లోని బెల్టుషాపులపై దాడులు చేసిన అధికారులు భారీగా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. పైగా కొత్త, పాత బెల్టు షాపుల నిర్వహణలో పట్టుబడిన వారిని ఉన్నతాధికా రుల ఎదుట బైండోవర్ చేసినందుకు కూడా నగదు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. బెల్టు షాపులు నిర్వహిస్తూ మామూళ్లు ఇవ్వకుండా పట్టుబడిన వ్యక్తులతో ఇంటి సామాన్లు తెప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారిస్తాను

గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాము. అటువంటి దుకాణాలు నిర్వహించే వ్యక్తుల సమాచారం ఇవ్వమని ప్రజలను అడుగుతున్నాము. బెల్టు షాపులు, బైండోవర్ పేరిట నగదు వసూళ్లపై నాకు సమాచారం లేదు. విచారిస్తాను.

- రాగమయి, సెబ్ - 2 సీఐ (రూరల్)

ఆంధ్రా క్రికెట్ సంఘం సెలక్షన్ కమిటీ సభ్యుడిగా కోటారెడ్డి

నెల్లూరు (విద్య), మే 7 : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జూనియర్స్ మెన్ సెలక్షన్ కమిటీ సౌత్‌జోన్ సభ్యుడిగా మాజీ రంజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డిని నియమిస్తూ ఏసీఏ నిర్వాహకులు ఆదేశాలు జారీ చేశారు. ఆయన జిల్లాలో క్రికెట్‌కు విశేష సేవలందించడం తోపాటు గత ఏడాది కూడా సెలక్షన్ కమిటీ సభ్యుడిగా విధులు నిర్వర్తించారు. ఏసీఏ నిర్వాహకులు తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని కోటారెడ్డి తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు ఆయన ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి మహాసంప్రోక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 11వతేదీ వరకు మహాసంప్రోక్షణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి కార్యదర్శి అయితా రామచంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు, సుందరకాండ పారాయణం జరుగుతాయని తెలిపారు. 11వతేదీ ఉదయం మహాపూర్ణాహుతి, అనంతరం కుంభప్రోక్షణ, అన్నదానం, సాయంత్రం 6.30గంటలకు సువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవం జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

ఎన్నికల పర్వం

ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధం కండి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 7 : ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల కురుక్షేత్రానికి ఓటర్లు సిద్ధంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన 10వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవ సేనను తరిమికొట్టాలని వైసీపీని ఉద్దేశించి పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణకు ఓటేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకర్ల తిరుమల నాయుడు, వెంకట్రావు, వెంకటకృష్ణ, శేఖర్, సురేష్, శ్రీనివాసయాదవ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రం అందజేస్తున్న శ్రీనివాసులు రెడ్డి

కూటమి ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి

● టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

నెల్లూరు (విద్య), మే 7 : రాష్ట్రంలో సంక్షేమం, సమగ్రాభివృద్ధి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 7వ డివిజన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అమలు జరుగుతాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో పాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ప్రజలంతా కూటమికి అండగా ఉండి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌రెడ్డి

సత్యకుమార్‌పై అసత్య అరోపణలు మానుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 7: బీజేపీ నాయకుడు వై సత్యకుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని లేనిపక్షంలో తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి హెచ్చరించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యకుమార్ బీజేపీలో అనేక పదవులను పొంది పార్టీ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. సామాన్యుడు వెళ్లినా చేతనైన సహాయం చేసే వ్యక్తి సత్యకుమార్ అని కొనియాడారు. బీజేపీలో సభ్యత్వం కూడా లేని భాస్కర్‌నాయుడు వంటి వ్యక్తి సత్యకుమార్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం విజయకుమార్, ఎర్రబోలు రాజేష్, చిలక ప్రవీణ్, పరశురాం, కుమార్, ముక్కు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులు

● వాటిని సమానంగా తీసుకెళ్లే సత్తా చంద్రబాబుకే ఉంది : రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 7 : రాష్ట్ర ప్రగతికి అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల వంటివని, వాటిని సమానంగా ముందుకు తీసుకెళ్లే సత్తా చంద్రబాబుకు ఉందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్య ర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బుజబుజనెల్లూరులో రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి జరుగుతూనే సంక్షేమ పథకాలు అమలు కావాలన్నారు. అప్పుడు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు. ఈ రెండింటినీ సమతులంగా తీసుకెళ్లడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జగన్ బటన్లు నొక్కుకుంటూ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశారని, తద్వారా కోలుకోలేనంత వెనక్కు రాష్ట్ర వెళ్లిపోయిందన్నారు. తిరిగి ఏపీని గాడిలో పెట్టాలంటే అనుభవం కలిగిన చంద్రబాబు చేతికి రాష్ట్ర పగ్గాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటేసి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఐదేళ్ల రాష్ట్రంలో జరిగిన ఘోరాలు, పూర్తిగా స్తంభించిన అభివృద్ధి, యువతకు అందని ఉద్యో గాలు, రాష్ట్ర ప్రగతికి దోహదపడని పరిశ్రమల ఏర్పాటుపై ప్రజలంతా చైతన్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 4 నుంచి ఏపీలో ప్రజల ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పారు.



దేవరపాళెం ప్రచారంలో వీపీఆర్ అన్న కుమారుడు సందీప్‌రెడ్డి తదితరులు



బుజబుజ నెల్లూరులో విక్టరీ సింబల్ చూపుతున్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

కాగా, నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్న కుమారుడు వేమిరెడ్డి సందీప్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నెల్లూరులోని కోటంరెడ్డి కార్యాలయంలో కలివెలపాళేనికి చెందిన సనత్‌కుమార్‌రెడ్డి మిత్రబృందం, జిల్లా నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మిత్రబృందం, 26వ డివిజన్‌కు చెందిన మస్తాన్‌బీ, సౌత్ మోపూరుకు చెందిన యేంపులూరు దయాకర్, లీలా ప్రసాద్‌కు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, పద్మాకర్‌రెడ్డి, తాటిపర్తిబాబు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానికి ఆర్థిక సాయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 7: కోవూరు నియోజకవర్గం గుమ్మలదిబ్బ ప్రాంతంలో ప్రమాదాని కి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎన్టీఆర్ అభిమాని ధర్మకుంటా నవీన్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. త్వరలోనే నవీన్ కోలుకుంటాడని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాని జీ సుభాష్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న యశ్వంత్‌సింగ్

ఘనంగా కవి రవీంద్రుని జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 : జాతీయ గీత రచయిత, విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎస్‌ఆర్‌కే విశ్వసాయి స్కూలులో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రవీంద్రుని జీవితంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వర్షితకు బహుమానం అందజేసి అభినందించారు. బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, పాఠశాల డైరెక్టర్ కృష్ణమోహన్, ఉపాధ్యా యులు సునీల్, అంకబాబు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేత వర్షితకు బహుమతి అందజేస్తున్న బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి


మేకపాటిపై చర్యలు తీసుకోవాలి: పొట్లూరి

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష

ఆత్మకూరు, మే 7: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరపు వెంకట రమణమ్మను కులం పేరుతో కించిపరస్తూ మాట్లాడిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని వెన్నలకంటి రాఘవయ్య మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆత్మకూరుకు విచ్చేసి గోపవరపు వెంకటరమణమ్మను పరామర్శించి మాట్లాడారు. బాధ్యత గల మాజీ ఎంపీ.. ఒక మహిళాప్రతినిధిని కులం పేరు ఎత్తడమే కాకుండా, నెత్తి మీద రూపాయ పెడితే పైసాకు పనికిరాదని వ్యంగంగా మాట్లాడడం సరికాదన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఎన్నికల అనంతరం మర్రిపాడు పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజన సంఘాల సభ్యులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు.

పదవులు ఆశించకుండా అభివృద్ధికి కృషి చేశా : బీద

అల్లూరు, మే 7 : పదవులు ఆశించకుం డా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతా అవినీతిమయంగా మారిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఆయన స్వ గ్రామమైన ఇస్కపల్లి పంచాయతీలోని శం భునిపాలెం, ఇస్లాంకాలనీ, అరుంధతీయవాడ, దళితవాడ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నెల్లూరు పార్లమెటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లు డు బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చరణ్‌రెడ్డిలతో కలసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ముందుగా శంభునిపాలెం గ్రామస్థులతో మాటామం తీ కలిపారు. అనంతరం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానన్నారు. ఆ కృషి ఫలితమే ఈరోజుకీ దర్శనమిస్తున్నాయేతప్ప వైసీపీ పాలనలో ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలన్నా వారికి ఉద్యో గ, ఉపాధి అవకాశాలు కలగాలన్నా రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ చూసినా అవినీతి, అరాచకాలు రాజ్యాన్నేలే విధంగా నూతన పాలనా విధానాన్ని రాష్ట్రానికి పరిచయం చేసిన వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. డ్రామాలను ప్రజలు కనిపెట్టేశారని, ఇక అటువంటి వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీకే హారూన్ రషీద్, పురిణి దేవరాజ్, నాటారు శీనయ్య, పుచ్చలపల్లి రవి, నాగరాజు, గాంధీ, వెంకట రమణయ్య, గంగపట్నం శీనయ్య, పుచ్చలపల్లి బాబు, పి.శీనయ్య పాల్గొన్నారు.



తిరుపతిలో దొంగలు పడ్డారు!

తండ్రీ కొడుకులు కమీషన్ రాయుళ్లు

కరుణ,అభినయ్‌లపై పవన్ ధ్వజం

తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిలను గెలిపించాలని అభ్యర్థిస్తున్న పవన్‌కల్యాణ్



తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి):ప్రతి పనికీ కమీషన్లు పంచుకునే తండ్రీకొడుకులకు తిరుపతి ప్రజలు భయపడాలా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇల్లు కట్టాలంటే ఎమ్మెల్యే కరుణాకర రెడ్డికి 30 శాతం, ఆయన కొడుకు అభినయ్‌కి 10శాతం కమీషన్ ఇవ్వాలట కదా అని ప్రశ్నించారు.రూ.200 కోట్ల కమీషన్ల కోసం తిరుపతిలో గోవిందరాజ స్వామి సత్రాలను కూలదోసి కొత్తవి కడుతున్నారని ఆరోపించారు.మీరు తిరుమల హుండీలో వేసిన కానుకలనూ దోపిడీ చేశారన్నారు. ప్రతి పనికీ పది నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీవారి ఖజనాకు ఆదాయం వస్తుంటే వైసీపీ నాయకులు కొండపై తిష్ట వేసి ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. కరుణాకర రెడ్డి, అభినయ్ టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.2వేల కోట్లు నొక్కేశారని,చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కోట్లు గడించారని ఆరోపించారు.అలాంటివారికి ఎందుకు భయపడుతున్నారని జనాన్ని ప్రశ్నించిన ఆయన మన దమ్మేంటో తేల్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఏడుకొండలవాడిని పైన పెట్టుకుని ఇక్కడి ఆకు రౌడీలకు భయపడడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వం రాగానే రౌడీలను ఉక్కుపాదంతో తొక్కిపడేస్తామన్నారు. టీటీడీ సహకారంతో విద్య, వైద్యానికి నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. నగరంలోని 40కి పైగా మురికివాడలను అభివృద్ధిని చేస్తామని, యూడీఎస్‌ను బాగు చేసుకునే బాధ్యత కూటమి తీసుకుంటుందని చెప్పారు.వైసీపీ నేతల దెబ్బకు పరారైన పెద్ద పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.ప్రతినెలా రెండో మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తామన్నారు.తిరుమలను దళారీ వ్యవస్థకు అడ్డాగా, ఒక రిసార్ట్‌గా మార్చేశారని, ఇక్కడ ఆధ్యాత్మిక పరిమళాలలను తిరిగి తీసుకొస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులకు ఇచ్చే ఇళ్ల పట్టాలపై జగన్ ఫొటోలు వేయడం ఏడుకొండల వాడిని అవమానించడమేనన్నారు.అక్రమంగా ఓట్లను కొనుగోలు చేయడానికి కరుణాకర రెడ్డి మనుషులు ఇచ్చిన డబ్బులను తిరిగి హుండీలో వేసేయండని పిలుపునిచ్చారు. దీని పర్యవసానం భవిష్యత్తులో ఆయనకు తెలుస్తుందన్నారు.

2009లో చిరంజీవిని గెలిపించారు. తిరుపతిపై ఆయనకు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలున్నాయి.నిర్వాసితులకు 1100 ఇళ్లు నిర్మించాలని చిరంజీవి ప్రతిపాదిస్తే 149 ఇళ్లుమాత్రమే నిర్మించారు.మిగిలినవి శ్లాబ్ వేయకుండా పక్కనపెట్టేశారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ ఇళ్లకు శ్లాబ్ వేయిస్తాం.

ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా వుండాలి

రోడ్‌షోలో టీడీపీ అధినేత చంద్రబాబు

తిరుపతికి తెలుగు గంగ నీటిని తెప్పించాం. గరుడ వారధి మంజూరు చేయించి పనులు ప్రారంభించాం. చంద్రగిరి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయించాం.తిరుపతిని చదువుల కేంద్రంగా తయారుచేయాలని ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ తీసుకొచ్చాం.తిరుపతి చుట్టూ టీసీఎల్, జోహో, సెల్కాన్, కార్బన్, డిక్సన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమలు తీసుకొచ్చి ఎలక్ట్రానిక్ హబ్‌గా మార్చాం.

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో దొంగలు పడ్డారని, ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా వుండాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి ఆయన తిరుపతిలో రోడ్‌షో నిర్వహించారు. నగరంలోని నాలుగు కాళ్లమండపం కూడలిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలోనే పుట్టి పెరిగానని, ఇక్కడే చదువుకున్నానని పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు.ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన నేతగా ఎదిగానన్నారు. పాలనలో నిజాయితీగా వ్యవహరించినందుకు తనపై శత్రువులు 23 క్లైమోర్ మైన్లు పేల్చారని, అయితే వెంకటేశ్వరస్వామి తనకు పునర్జన్మ ఇచ్చారనన్నారు. సీట్ల విషయంలో సామాజిక న్యాయానికి కట్టుబడి తాము కూటమి తరపున ఆరణి శ్రీనివాసులును పోటీకి నిలబెట్టామన్నారు.అదే వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. టీటీడీ ట్రస్టు బోర్డుకు ఈ ఐదేళ్లలో వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్లుగా పని చేశారని, చివరికి ఈవోగా కూడా ధర్మారెడ్డి వున్నారని, ఇదేనా సామాజిక న్యాయమని ప్రశ్నించారు. మేయర్ పదవి పేరుకు బీసీ మహిళకు కేటాయించినా పెత్తనం ఎవరిదని ప్రశ్నించారు. బీసీ మేయర్ వుండగా డిప్యూటీ మేయర్ పెత్తనం చెలాయించడం వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయడం కాదా అని నిలదీశారు.

గంజాయి దందాలో వైసీపీ నేతలకు వాటా

తిరుపతిలో గంజాయి దందా పెరిగిపోయిందని, అందులో కూడా వైసీపీ నేతలకు వాటా వుందని చంద్రబాబు ఆరోపించారు.ఈ పరిస్థితుల నుంచీ తిరుపతిని కాపాడేందుకు సిద్ధమా అంటూ పదేపదే నగరవాసుల్ని ప్రశ్నించి సానుకూల సమాధానాలు రాబట్టారు. తిరుపతిపై పవన్ కళ్యాణ్‌కు సెంటిమెంట్‌తో కూడిన అభిమానముందని, ప్రధాని మోదీ తిరుపతిని పవిత్రంగా భావిస్తారని చెప్పారు. తిరుపతిని పవిత్ర కేంద్రంగా నిలిపే బాధ్యత తాము ముగ్గురూ తీసుకుంటామని హామీ ఇచ్చారు.తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను, తిరుపతి అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును, చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రోడ్‌షోకు పోటెత్తిన జనం

తిరుపతిలో మంగళవారం రాత్రి జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోకు జనం పోటెత్తారు. పవన్ కళ్యాణ్‌ను చూసేందుకు ఆయన అభిమానులు ఓవైపు, టీడీపీ అధినేత కోసం ఆ పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో రోడ్‌షో జరిగిన ప్రధాన రహదారులు, కూడళ్ళు జనంతో కిక్కిరిసిపోయాయి. రేణిగుంటలోని ఎయిర్ పోర్టు నుంచీ కరకంబాడి మార్గంలో వచ్చిన అధినేతలు ఇరువురికీ జనం బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా కిలోమీటర్ల కొద్దీ ప్రజలు ప్రత్యేకించి మహిళలు, యువత గంటల కొద్దీ నిరీక్షించి స్వాగతం పలికారు. తిరుపతి లీలా మహల్ నుంచీ రోడ్‌షో ప్రారంభమైంది. అయితే ఆ కూడలి చేరుకునే సరికి శ్రీనివాస ఫ్లై ఓవర్‌పై లైట్లు ఆర్పేశారు. దీంతో లీలామహల్ కూడలిలో అంధకారం నెలకొంది. కూటమి పార్టీల కార్యకర్తలు మొబైల్ ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి పట్టుకోవడంతో ఎటు చూసినా వెలుగుతున్న మొబైల్ ఫోన్లే కనిపించాయి. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన చంద్రబాబు పర్యటనలో ప్రధాన కూడలిలో లైట్లు ఆర్పివేయడం ఆందోళన కలిగించింది. మొత్తం పర్యటనలో పోలీసు బందోబస్తు చాలా బలహీనంగా కనిపించింది. గతంలో ఇదే నాలుగు కాళ్ళ మండపం వద్ద చంద్రబాబు రోడ్‌షోలో రాళ్ళదాడి జరిగిన ఘటనలున్నా పోలీసు అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

నిఘా నీడలో ఓటింగ్

- పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసేలా ఈసీ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల్లో మంగళవారం నుంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల తెలంగాణలో ఎన్నికల సందర్భంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈసీ ప్రతి పోలింగ్ బూత్‌లో రెండేసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఒక కెమెరాను బూత్ బయట, మరో కెమెరాను బూత్ లోపల అమర్చుతున్నారు. కెమెరాలోనే మెమరీ, నెట్ సౌకర్యంతోపాటు రాత్రిళ్లు పనిచేసేలా లైట్లు కూడా అమర్చారు. మనుబోలు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు సమస్యాత్మక గ్రామాల్లో కూడా వీటిని ఏర్పాటు చేసేలా 89 సీసీ కెమెరాలను అమర్చనున్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారుగా 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సాంకేతిక సిబ్బంది తెలిపారు.

- మనుబోలు

రేపటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఎన్నికల దృష్ట్యా నిర్ణయం
- రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్
- ఇప్పటికే చార్జీలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జిల్లాకు తరలిరానున్నారు. పోలింగ్ తేదీ ఈనెల 13 సోమవారం రావడంతో ఎలాగో 12వతేదీ ఆదివారం సెలవు. ముందుగా 11వ తేదీ శనివారం రాత్రే వారంతా జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు శని, ఆదివారాలు సెలవు కావడంతో 10వతేదీ రాత్రే బయలుదేరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక ఓటేశాక 13వ తేదీ రాత్రి పలువురు తిరుగు ప్రయాణం అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా ఇప్పటికే హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రజలు బస్సుల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9,10,11 తేదీల్లో హైదరాబాదు నుంచి జిల్లాకు వచ్చేందుకు రోజుకు ఐదు చొప్పున ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ పూర్తిన వెంటనే అవసరాన్ని బట్టి ఎన్ని బస్సులు కావాలన్నా ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నామన్నారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ వారు ఇప్పటికే అధిక చార్జీలతో టికెట్ ధరలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలు, జరిమానా



ఎన్నికల పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తుపై సీరా, నీళ్లు పోయడం వంటి చర్యలు ఇందులో భాగామే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. పోలింగ్ సిబ్బంది ఇలాంటి చర్యలు పాల్పడితే ఐపీఎస్ 1951 సెక్షన్ 135ఏ 136 ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశ ముంది. ఇతరులు అయితే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు.

- ఉదయగిరి

యువగళం: నిజాయితీ గల నేతకే ఓటేస్తా..



ఈ ఎన్నికల్లో నేను మొట్టమొదటి సారిగా ఓటు వేయబోతున్నా. ప్రతి ఓటూ విలువైనదే. ప్రధానంగా యువత ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చూపడం వల్లే అవినీతి నాయకులు ఎన్నికల్లో గెలుస్తున్నారు. అందుకే అవినీతికి తావులేని నాయకుడికి ఓటు వేసి, నా మొదటి ఓటును సద్వినియోగం చేసుకుంటా.

-జే చౌదయ్య, సంగం

ఆక్వా రంగంలో రాష్ట్రానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. దేశంలో చేపట్టే ఆక్వా ఎగుమతుల్లో ఆంధ్రా నుంచే 65 శాతం జరుగుతుంటాయని సెంట్రల్ కోస్టల్ ఆక్వా అథారిటీ పేర్కొంది. అయితే... ఇదంతా ఐదేళ్ల క్రితం మాట.

నేడు...

జగన్ ప్రభుత్వం విధానాల వల్ల ఆక్వా రంగం కుదేలైంది. ఐదేళ్ల క్రితం జిల్లాలో 50 వేల ఎకరాల్లో చేపట్టిన రొయ్యల పెంపకం నేడు 20 వేల ఎకరాల్లో కూడా లేదు. ఇందుకు సాగుకు పెరిగిన వ్యయం... తగ్గిన ఆదాయమే కారణమని రైతులు అంటున్నారు. దీనికితోడు విద్యుత్ చార్జీల రాయితీని ప్రభుత్వం ఎత్తేసింది. అంతేకాక రొయ్యల గుంటల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని నిబంధనలు పెట్టింది.



రొయ్యకూ బాదుడే!

- భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- రాయితీలకూ మంగళం
- పెరిగిన సాగు వ్యయం... తగ్గుతున్న ఆదాయం
- పెంపకం చేపట్టలేమంటున్న సాగుదారులు
- ప్రోత్సాహమివ్వని వైసీపీ సర్కారు

అల్లూరు, మే 7 : ఎకరా వెనామీ సాగు చేపట్టాలంటే 100 కౌంట్ వస్తేగానీ దిగుబడి వచ్చినట్టు కాదు. 100 కౌంట్ ధర కిలో రూ.210 ఉండడంతో ఎకరానికి అయ్యే వ్యయం మాత్రం రూ.2.50 లక్షలు అవుతోంది. ఇందులో రొయ్య పిల్లల ధర రూ.80 వేలు కాగా, అవి తినే మేత 2 నుంచి 3 టన్నులు ఉంటుంది. మేతకు రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ఇలా చూసుకుంటే రొయ్యల ధరలు పతనమ య్యాయని చెప్పుకోవచ్చు. ఐదేళ్ల క్రితం ధరలు నియంత్రణలో ఉండడంతో రైతులకు కిలోకు రూ.20 నుంచి రూ.30లు మిగులుతూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

పెరిగిన విద్యుత్ చార్జీలు

ఆక్వా రంగానికి ప్రధానవసతి విద్యుత్. ఇది ఖర్చుతో కూడుకున్నది. గతంలో యూనిట్‌కు రూ.2 ఉండగా, ప్రస్తుతం రెండు గ్రేడ్లుగా విభజించి ఆక్వా జోన్‌కు రూ.4.20, నాన్ ఆక్వా జోన్‌కు రూ.6.50 చెల్లించాల్సి వస్తున్నదని దీంతో రైతులపై చార్జీల భారం పడింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో చార్జీలపై రాయితీ ఉండేది. జగన్ ప్రభుత్వం దాన్ని ఎత్తేసింది.

సబ్సిడీలేవీ ?

రాష్ట్రంలో 2019కు ముందు ఆక్వా రైతులకు పూర్తిగా ప్రభుత్వ సహకారం ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీలు 50 శాతానికి పైగా ఉండేవి. ఎంపెడా అధికార సీఈఈ ధ్రువీకరణ పత్రం ఉన్న ఆక్వా రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఏరియేటర్లు, మోటార్లు 50 శాతం రాయితీతో ఇచ్చేవారు.దీంతో వారికి భారం తగ్గేది. అంతేకాక రుణాలు మంజూరు చేసేవారు. అయితే జగన్ ప్రభుత్వం ఏ ఒక్క విషయంలో కూడా ఆక్వా రైతులను ఆదుకున్న పాపాన పోలేదు. దీనికితోడు గుంటలను ఏర్పాటు చేయాలంటేనే లైసెన్సు ఉండాలంటూ నిబంధనలు పెట్టింది. ఇందుకు ఫిషరీస్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసి, వారికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్నది.

లీజుదారుల పరిస్థితి దయనీయం

ఆక్వా సాగు సాధారణంగా భూమి కలిగిన రైతుకే పెనుభారంగా మారగా, ఇక లీజుదారుల పరిస్థితి వర్ణనాతీతమే. లీజు మొత్తం ముందుగానే రైతులకు చెల్లించి రొయ్యల సాగు చేపట్టాల్సిన పరిస్థితి. ఎకరానికి 100 కౌంట్ రొయ్యల పెంపకం చేపట్టాలంటే రూ.2.5 లక్షలు ఖర్చవుతుండగా, లీజు దారులకు మాత్రం రూ.2.70 నుంచి రూ.3 లక్షల వరకు వ్యయం అవుతోంది. దీన్ని భరించి సాగు చేపట్టాలంటే భారంగా మారింది.



ఏమన్నా మిగులుతుందే మోననే...

పదేళ్లుగా రొయ్యల పెంపకం చేపడుతున్నా. 2019కు ముందు ఆక్వా రంగం ఆశాజనకంగా ఉండేది. నాలుగు రాళ్ల వెనకేసుకున్నా. 2019 తరువాత నుంచి వ్యయం భారీగా పెరిగిపోయింది. దీంతో ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోయాను. ఈ దఫా ఏమన్నా మిగులుతుందే మోననే ఆశతో సాగు చేపడుతున్నా.

- కత్తుల విజయ్‌కుమార్, ఆక్వారైతు



మేత ఖర్చులు భరించలేకున్నాం...

గతంతో పోల్చితే రొయ్యల మేతల ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. మేత అరువుకు తెచ్చుకోవాలంటే దిగుబడి అయిన రొయ్యలను వారు అడిగిన ధరకు వారికే విక్రయించాలి. తద్వారా ధరలో తగ్గుదల మేత ఖర్చులో పెరుగుదల కలిసి ఖర్చులకు సరిపోవడం లేదు.

- పాలెపు చిరంజీవి బాబు, ఆక్వారైతు

సాగుకు భారీ వ్యయం

ఆక్వా సాగులో 80 శాతం ఖర్చుపెడితే 20 శాతం ఆదాయం వచ్చేది. కానీ 2019 తరువాత నుంచి వ్యయం పెరిగింది. ఆదాయం తగ్గుముఖం పట్టడంతో 20 శాతం మిగలకపోగా, 25 శాతం అదనంగా చేతి నుంచి పెట్టాల్సి వస్తోంది. ఈ కారణంగా రొయ్యల సాగులో తీవ్రంగా నష్టపోయా.

- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వారైతు





కందువాలకు గిరాకీ !

వింజమూరులో వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ప్రస్తుతం కండువాలకున్న గిరాకీ అంతాఇంతా కాదు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల కండువాలకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు లక్షల్లో కండువాలను కొనుగోలు చేస్తున్నారు. ఏ చోటకు వెళ్లినా పెద్ద ఎత్తున కండువాలను తీసుకెళ్లి ఇతర పార్టీల నేతలను తమ పార్టీలో చేర్చుకునే సమయంలోనూ వారికి వేస్తున్నారు. అలాగే ప్రచార ర్యాలీలు, బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించేటప్పుడు కూడా కార్యకర్తలు కండువాలు వేసుకుని పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రధాన సామగ్రిగా కండువాలు పెట్టుకుని ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఈ కండువాలు ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.100లు పలుకుతున్నట్లు సమాచారం. దీంతో ఒక్కో అభ్యర్థికి కండువాలకే రూ.50 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం.

- ఉదయగిరి రూరల్

చేపా.. చేపా... ఎక్కడ ?

- నిషేధిత అలివి వలలతో వేట
- సోమశిలలో అంతరిస్తోన్న మత్స్యసంపద
- ఉత్పత్తిపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- వేట లేక జాలర్ల ఇక్కట్లు



సోమశిల జలాశయంలో అడుగంటిన నీటిమట్టం

అనంతసాగరం, మే 7: అపార మత్స్యసంపదకు నిలయంగా ఉన్న సోమశిల జలాశయంలో నేడు చేపల జాడే కనిపించడం లేదు. దీంతో డ్యామ్‌పై ఆధారపడి జీవిస్తున్న జాలర్ల జీవనం అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత జలాశయం నీటిమట్టం అడుగంటి 8 టీఎంసీలకు పడిపోయింది. ఈక్రమంలో ఆశాజనకంగా చేపలవేట ఉండాలి. అయితే జలాశయంలో వేటకు వెళ్లిన జాలర్లకు చేప దొరకడం లేదు. ఈ పరిస్థితి వారిని ఆందోళనకు గురిచేస్తున్నది. జలాశయం పరిధిలో సుమారు 400 మంది లైసెన్సు కలిగిన జాలర్లు ఉన్నారు. వీరంతా రోజువారీ వేటకు వెళ్లి రూ.500 నుంచి రూ.1500 వరకు సంపాదించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా వేట సాగక జాలర్ల ఆందోళన చెందుతున్నారు.

- **ప్రధాన కారణాలు ఇవే..**

స్థానికంగా కొంతమంది వ్యాపారులు మాఫియాగా ఏర్పడి నిషేధిత అలివి వలలతో వేట సాగిస్తున్నారు. చిన్నాపెద్దా చేపలను ఒడ్డుకు లాగేసి చేపల ఉత్పత్తికి గండి కొడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపల సంతానం తగ్గి వేటసాగని పరిస్థితి దాపురించింది. ఈ మత్స్య మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు గతంలో ఉన్నతాధికారులకు జాలర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు.

- **పెంపకంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం**

ఇదిలా ఉండగా చేపల ఉత్పత్తి పెంచేలా వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. గత టీడీపీ హయాంలో మీనోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో లభించే మూస, ఎర్రగండి, నల్లగండి చేపపిల్లను తెచ్చి జలాశయంలో వదిలేవారు. మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడం లేదు. ఈ నాలుగేళ్లలో ఒక్కసారి కూడా జలాశయంలో చేపపిల్లలను వదిలిన దాఖ లాలు లేవు. ఈకారణాలతో నేడు డ్యామ్‌లో చేపల ఉత్పత్తి తగ్గి, వేట జరగని దుస్థితి నెలకొన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో బాగా వేట జరిగితే సుమారు 10 టన్నుల చేపలు సోమశిల నుంచి కోల్‌కతా, చైన్నై, పూణే లకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం రెండు టన్నుల కూడా ఎగుమతి కావడం లేదు.

అలివి వలల వల్లే ఈ పరిస్థితి



జలాశయంలో నిషేధిత అలివి వలల వేట వల్లే నేడు ఉత్పత్తి తగ్గి వేట సాగడం లేదు. ఈ అక్రమ వేటను అడ్డుకొని ఉంటే ఈపరిస్థితి ఉండేది కాదు.

- వై సుబ్బారావు, జాలరి సోమశిల

నీరు తగ్గినా చేప దొరకడం లేదు..



జలాశయం నీటి మట్టం పూర్తిగా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో వలకు చేపలు దండిగా పడాలి. అయితే జలాశయంలో వేటకు వెళితే శ్రమ తప్ప ఎలాంటి ఫలితం లేకుండా ఉంది.

- ప్రసన్నకుమార్, మత్స్యకారుడు, సోమశిల

ఎట్టెట్టా: ఖాళీ లేదు.. బ్రదర్ !



పో... పోవయ్యా... ఎన్నికలయ్యేదాకా ఈ నాట్రోజులు కుదరందే కుదరదు !

ఏం తమ్ముడూ... రేపు పనుంది వస్తావా... ? అని అడిగితే ఎవరూ ముందుకు రావడంలేదు. ఖాళీలేదు బ్రదర్ .. వారం రోజుల వరకు అడగొద్దు... మాకూ పని ఉంది... అనే మాటలు ప్రస్తుతం గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కూలీలంతా బిజీ అయిపోయారు. ఎన్నికల వేళ వారికి చేతినిండా పని దొరికింది. ప్రచారంలో తిరుగుతూ రోజుకూలి సంపాదించుకుం టున్నారు. పనికెళితే ఏం వస్తుంది...? ఎండలో మాడిపోవడం తప్ప.. అనుకుంటూ ప్రచారానికి వెళుతున్నారు. రోజూ రూ.500, మద్యం సీసా ఇచ్చి, భోజనం కూడా పెడుతున్నారు. ఎండలకు కార్యకర్తలు ఎవరూ పెద్దగా రాకపోవడంతో ఇలా కూలీలను తీసుకువెళుతున్నారు. వీరే ఓ ఊరిలో ఓ పార్టీలో.. మరో ఊరిలో మరో పార్టీలో కనిపిస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.

- ఉదయగిరి

నా జ్ఞాపకం: మాటకు కట్టుబడేవారు..



గతంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేవారు. ఇప్పటి ఎన్నికల్లో మాదిరిగా భయాలు, ఆందోళనలు ఉండేవికావు. నాయకులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవారు. గ్రామంలోని ఓ నాయకుడి వెంటే అందరూ నడిచేవాళ్లు. ఇప్పటి లాగా పార్టీల ఫిరాయింపులు ఉండేవికావు. గతంలో ఓటు వేసేందుకు ఐదారు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. అప్పుడు అభ్యర్థులు చేసిన, చేయబోతున్న పనులు చెప్పేవారు కాదు. ఇప్పుడు నేతలంతా అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని గొప్పలు చెప్పుకుంటున్నారు.

- ఎం. సుబ్బయ్య, (90), జంగాలకండ్రిక, సంగం మండలం


నేటి ముచ్చట: ప్రచారాల హోరు.. నాయకుల జోరు !

ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఎన్నికల వేడి ప్రజలకు ఊపిరాడనివ్వడంలేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి, సాయంత్రం మరో పార్టీ అభ్యర్థి.. ఇలా ఒకరి వెంట మరొకరు ప్రచారానికి వస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికితోడు రోజంతా ప్రచార రథాల మైకుల హోరుతో చెవులు చిల్లులు పడుతున్నాయి. చిన్న చిన్న గ్రామాలకు ఉదయం పూట, పెద్ద గ్రామాలకు సాయంత్రం వేళలో నేతలు ప్రచారానికి వస్తున్నారు. కందుకూరు నియోజకవర్గానికి అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఇద్దరూ కొత్తవారే అయినా, తమకు ఓ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇక ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అలాగే ఓవైపు మేనిఫెస్టో అంశాలను ప్రస్తావి స్తూనే...మరోవైపు స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. మొత్తానికి గ్రామాల్లో రాజకీయ సందడి జోరుగా కనిపిస్తోంది.

- వలేటివారిపాలెం



రిజర్వాయర్లో మునిగిన జగన్ హామీ



● సీఎం మాటిచ్చినా ముందుకు పడని అడుగు

● ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను వెంటనే మొదలు పెట్టి పూర్తి చేస్తా..

● 2023 జులైలో వెంకటగిరి సభలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ఇది..

డక్కిలి, మే 7: డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు వెంటనే మొదలు పెట్టి పూర్తి చేస్తామన్న ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదు. హామీ ఇచ్చి 9 నెలలు కావస్తున్నా రిజర్వాయరు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2018లో రూ.400 కోట్లతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఈ రిజర్వాయర్ విషయంలో చొరవ తీసుకున్నారు. అప్పటి సీఎం చంద్రబాబు వెంటబడి మరీ మంజూరు చేయించారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణం ఎక్కువ భాగం అటవీ అడ్డంకులతో ఆగిపోయింది. అప్పట్లో ఈ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చు చేసింది. తిరుపతి నుంచి డక్కిలి వరకు కాలువ నిర్మాణం పూర్తయింది. ఇక్కడి నుంచి సోమశిల వరకు కాలువ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో అనుమతులు జాప్యం కావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. లక్ష్యం దెబ్బతింటుందని గ్రహించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కాలువ నిర్మాణంలో అలైన్‌మెంట్ మార్చి పనులు మంజూరు చేశారు. ఆయన హయాంలోనే పనులు మొదలయ్యాయి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక పనులను రీటెండరింగ్ పేరుతో ఆపేసింది. తర్వాత పనులు మొదలు పెడతామన్న సీఎం జగన్ మాట నిలబెట్టుకోలేదని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయరు పూర్తయితే 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రజలకు తాగు నీరు అందుతుంది. మహత్తర ప్రాజెక్టును అడ్డుకోవడం తగదని వైసీపీ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆగిపోయిన ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు

మూడో రోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

సూళ్లూరుపేట/ గూడూరు అర్బన్, మే 7: సూళ్లూరుపేట వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో మూడో రోజు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగింది. 93.13 శాతం నమోదైంది. 1865 ఓట్లకుగాను 1737 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో చంద్రముని తెలిపారు. కాగా ఎన్నికల నిబంధల మేరకు విధులకు హాజరయ్యే సిబ్బంది పోలింగ్ బూత్‌లోకి మొబైల్ ఫోన్లు నిషేధం. కాని సూళ్లూరుపేట పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది ఫోన్లలో తరచూ మాట్లాడుకుంటూ ఉండడం విశేషం. పర్యవేక్షణలో ఉన్న ఎన్నికల అధికారులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. గూడూరు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో మొత్తం 2627 ఓట్లు ఉండగా మంగళవారానికి 2298 ఓట్లు పోలవడంతో 87.47 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. బుధవారం కూడా ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది.


పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

సూపర్ సిక్స్‌తో వైసీపీలో వణుకు



ప్రచారరథం నుంచి అభివాదం చేస్తున్న పరసా, టీడీపీ అభ్యర్థి విజయశ్రీ - ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

తడ/నాయుడుపేట, మే 7: టీడీపీ హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌తో వైసీపీలో వణుకు మొదలైందని అందుకే సీఎం జగన్ మాటల్లో బేలతనం కనబడుతోందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం విమర్శించారు. మంగళవారం తడ మండలంలోని వాటంబేడు, కారిజాత, కొండూరు, తడ పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ఈ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వాటంబేడులో వీధివీధిన పూలవర్షంతో స్వాగతం పలికారు. ఎక్కడిక్కడ మహిళలు హారతులు ఇస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. సైకో పో వాలి... సైకిల్ రావాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రచారంలో ప్రజల స్పందన చూస్తుంటే సైకో జగన్‌కు మూడినట్లే అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో 160 సీట్లల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. కూటమి మేనిఫెస్టోకు ప్రజలనుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లు వంటి పథకాలతో వైసీపీ బెంబేలుపడుతోందన్నారు. ఐదేళ్లపాటు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ఈ ప్రభుత్వం ఎప్పుడు దిగిపోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రాజధాని అమరావతిని సర్వనాశనం చేసిన జగన్ మూడు రాజధానులు కడుతానంటూ గొప్పలు చెప్పారని కనీసం ఒక్క రాజధాని కట్టలేని జగన్‌కు పాలించే అర్హత లేదని ధ్వజమెత్తారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, నాయకులు బి.శ్రీధర్, మురళీరెడ్డి, నీలకంఠం, బి.పళణి, సురేష్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, చంద్రయ్య, ఏకాంబరం, వెంకటయ్య, బీజేపీ నాయకులు ఆర్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు... రాష్ట్రాభివృద్ధికి మలుపు


ప్రచారంలో విజయభాస్కర్‌రెడ్డి, ప్రభావతమ్మ, కృష్ణారెడ్డి తదితరులు

టీడీపీ విజయంతో రాష్ట్ర సంపూర్ణ అభివృద్ధికి మలుపు అవుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట మాజీ సర్పంచు జి.ప్రభావతమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ 786 రఫి ఆధ్వర్యంలో కాలువగట్టు, పొగగొట్టం, జైహింద్‌కాలనీ, మండలంలోని పుదూరు, అరవపెరిమిడిల్లో ఇంటింటా టీడీపీ సూపర్ సిక్స్‌పై ప్రజలకు వివరించారు. శ్రీరాం ప్రసాద్, ఎం.శోభారాణి, గాలి రాజేష్‌నాయుడు, సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎ.సుధీర్, పసల చినపెంచలయ్య, గంగాప్రసాద్, పృథ్వీ, సుజాతమ్మ, రేవతి, బీజేపీ నాయకులు మాలాద్రి నాయుడు తదితరులు ఉన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయండి: టీడీపీ


బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి/ పెళ్లకూరు, మే 7: రైతుల మెడకు ఉరితాడులా మారిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ బాలాయపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్.మస్తాన్ నాయుడు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి, కె.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నా రు. పెళ్లకూరు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పేరం రమేష్ నాయుడు, పరుశురాం, సురేష్ తదితరుల ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు

సూళ్లూరుపేట, మే 7: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వ ర్యంలో మంగళవారం వైసీపీకి చెందిన ఈ.వీ.వీ.సురేష్ టీడీపీలో చేరారు. గంగాప్రసాద్ నివాసంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, సర్పంచు టి.శ్రీనివాసులురెడ్డి, జనసేన నాయకుడు పి.కాటయ్య పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: ఎమ్మార్పీఎస్

చిల్లకూరు, మే 7: రాబోయే ఎన్నికలల్లో అభివృద్ధిని ఆకాంక్షించే ఎన్డీఏ కూటమి అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, వెలగపల్లి వరప్రసాద్‌రావును గెలిపించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. మల్లికార్జున, సిసింద్రి, మస్తానయ్య, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అసభ్య ప్రవర్తన వాహనం నుంచి దూకేసిన మహిళ

తడ, మే 7: ఆటోలో ఎక్కిన ప్రయాణికురాలితో డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆ మహిళ వాహనం నుంచి దూకేయడంతో గాయాల పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...అండగుండాల గ్రామానికి చెందిన పద్మ సూళ్లూరుపేటలో పనిచేస్తుంది. రోజూ బస్సులో వెళ్లివస్తుంది. సోమవారం బస్సు వెళ్లిపోవడంతో ఆటో ఎక్కింది. అక్కంపేట సమీపంలోని కెమికల్ ఫ్యాక్టరీ వద్ద వేరే మార్గంలో వెళ్తుండటాన్ని గుర్తించిన మహిళ ఆటోనుంచి కిందకు దూకేసింది. వెంటనే కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు రావడంతో ఆటోతో డ్రైవర్ పరారయ్యాడు. గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆటో డ్రైవర్‌ను గుర్తించి అరెస్టు చేశారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

చిల్లకూరు, మే 7: మండలంలోని బల్లవోలులో మంగళవారం సాయంత్రం వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. గ్రామానికి శేఖర్‌బాబు, సుబ్రమణ్యం, వెంకట సుబ్బయ్యలు టీడీపీ మద్దతుగా ఉండడంతో ఓర్వలేక అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కొట్టు నాగరాజు, రాయపు సుబ్రమణ్యం... శేఖర్‌బాబు దుకాణం వద్దకు వెళ్లి కూల్‌డ్రింక్ కావాలని అడుగుతూ గొడవకు దిగి కమ్మీలతో దాడి చేశారు. దీంతో వెంకటసుబ్బయ్యకు, సుబ్రమణ్యంకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్సనిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ నుంచి టీడీపీలో చేరిక

వాకాడు, మే 7: మండల ఆమ్‌ఆద్మీపార్టీ అధ్యక్షుడు జయపాల్ తన అనుచరులతో కలసి మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పాశం వారిని సాదరంగా ఆహ్వానించారు. కూటమితోనే మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని భావించి 80 కుటుంబాలతో టీడీపీలో చేరామన్నారు.

సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలకూ సంక్షేమం: కురుగొండ్ల



కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు - వెంకటగిరి పట్టణం 15వ వార్డులో ప్రచారం చేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, డక్కిలి, మే 7: వెంకటగిరిలో గెలవబోయేది తమ పార్టీయే అని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. మంగళవారం డక్కిలి మండలం కెబిపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఆ గ్రామ టీడీపీ నాయకుడు నాగం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరందరికి కురుగొండ్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... వెంకటగిరిలో తెలుగుదేశం జెండా ఎగరవేయబోతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో నిజంగానే సూపర్‌గా ఉందని ప్రజలు కితాబిచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు వల్ల ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ పథకాలన్నీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని ఇరవై ఏళ్ళు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. జగన్ మళ్లీ వస్తే తమ ఆస్తులు కూడా దక్కవని ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. ఎలాగైనా సరే జగన్‌ను ఓడించాలన్న కసితో జనం ఉన్నారని ఈ నెల 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో కసినంతా తీర్చుకుంటారని చెప్పారు. ఇక రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపించడంతో వైసీపీని వీడుతున్న వారి సంఖ్యం పెరుగుతోందన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

ప్రజల ఆస్తులు కాజేసేందుకే ఆ యాక్ట్

కురుగొండ్ల కుమార్తె లక్ష్మీసాయిప్రియ

ప్రజల ఆస్తులు కాజేసేందుకే సీఎం జగన్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని తెరపైకి తీసువచ్చారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుమార్తె లక్ష్మీసాయిప్రియ ఆరోపించారు. మంగళవారం ఆమె పట్టణంలోని 15వ వార్డులో తన తండ్రి రామకృష్ణను గెలిపించాలంటూ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని భక్షించేలా చట్టాలు చేయడం సరికాదన్నారు. వంశపారపర్యంగా సంక్రమించిన ఆస్తిపై జగన్ ఫొటో ఎందుకు ముద్రించారని ఆమె ప్రశ్నించారు. చివరకు జగన్‌కు ఫొటో పిచ్చి పట్టిందన్నారు. చివరకు డెత్ సర్టిఫికెట్‌పై కూడా ఆయన ఫొటో ముద్రించడం చూసి ప్రజలకు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీ నాయకులు, యువతతో కలిసి ప్రచారంలో లక్ష్మీసాయిప్రియ

అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి

తిరుపతి బీజేపీ అభ్యర్థి వరప్రసాద్



గూడూరు మసీదులో ప్రార్థన చేస్తున్న వరప్రసాద్ - తిరుపతిలో జరిగిన ప్రచారంలో చంద్రబాబు, పవన్‌తో వరప్రసాద్

గూడూరు అర్బన్, తిరుపతి, మే 7: ప్రజలకు సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని మసీదులో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రార్థనలు నిర్వహించారు. పలువురు బీజేపీలో చేరడంతో వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మసీదు వద్ద దుకాణంలో టీ తాగుతూ, అందరినీ సరదాగా పలకరిస్తూ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎంపీగా గెలిస్తే అమృతపథకంతో సమానంగా కేంద్రం నుంచి మున్సిపాలిటీకి నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధిపనులు చేపడుతామన్నారు. అశోక్ నగర్ సమీపంలో మరో రైల్వే అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. వందేభారత్ రైలు గూడూరులో స్టాపింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసప్ప, మన్నెం శీనయ్య, వినీష్, రమణయ్య, సుమన్, దిలీప్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌ని గెలిపించి మోదీకి కానుకగా ఇద్దాం

తిరుపతి, మే7(ఆంధ్రజ్యోతి): సర్వేలన్నీ ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉన్నాయని, ధర్మమే గెలిచి తీరుందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తిరుపతిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను 2009లో తానే రాజకీయాల్లోకి ఆహ్వానించానని చెప్పారు. కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను గెలిపించి నరేంద్ర మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. చంద్రబాబుకి తిరుపతిలో వీధివీధి తెలుసని, ఇక్కడే పుట్టి, పెరిగి ఎస్వీయూ విద్యార్థి నాయకుడిగా ఎదిగారన్నారు. అలిపిరి బాంబు ఘటనలో దుమ్ముదులుపుకుని రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న చంద్రబాబు మద్దతుతో ఆరణి శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. పులివర్తి నాని, సుగుణమ్మ, సీఆర్ రాజన్, నరసింహ యాదవ్, డాక్టర్ హరిప్రసాద్, భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి


కోనేటిమిట్టలో చింతామోహన్ ప్రచారం

గూడూరు, మే 7: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. మంగళవారం కోనేటిమిట్టలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే దుగరాజపట్నం పోర్టు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు నిర్మాణం జరిగితే లక్షలాది మందికి ఉద్యోగవకాశాలు మెరుగుపడుతాయన్నారు.ఎంపీ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ రామకృష్ణారావును గెలిపించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట, మే 7: పట్టణంలో బుధవారం ఉదయం 7నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మురళి తెలిపారు. చెంగాళమ్మ ఆలయ సమీపంలోని హైవే సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బాపూజీ వీధి, కచ్చేరి వీధి, జీఎన్‌టీ రోడ్డు, పాండురంగ వీధులతో పాటు పరమేశ్వరినగర్, సాయినగర్, సూళ్లూరు ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వలంటీర్ల రాజీనామా

చిల్లకూరు, మే 7: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 23 మంది వల్లంటీర్లు మంగళవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. లింగవరం సచివాలయ పరిధిలో 9 మంది, వరగలి-4, తిక్కవరం-2, బల్లవోలు-4, కడివేడు-1 తమ్మినపట్నం-2, ఓడూరు వలంటీరు రాజీనామా పత్రాలను అందించినట్లు తెలిపారు.

అధికారంలోకి రాగానే గూడూరును నెల్లూరుజిల్లాలో కలిపేందుకు కృషి



బుర్లావారిపాళెంలో జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్

వాకాడు, మే 7: ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే, తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలవగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం వాకాడు మండలంలోని ఎరగాటిపల్లి, బాలిరెడ్డిపాళెం, వాలమేడు, జమీన్‌కొత్తపాళెం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడంతో పనుల నిమిత్తం వెళ్లేవారు, ఉద్యోగులు వ్యయప్రయాసలు పడుతున్నారన్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్ ఈ విషయమై హామీ ఇచ్చారన్నారు. తీరప్రాంతాల్లో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు సముద్రముఖ ద్వారాల పూడికతీత పనులు చేపడుతాన్నారు. బాలిరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండ స్వేచ్ఛగా ఓటు వేసి గెలిపించాలన్నారు. బుర్లావారిపాళెంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రచారంలో సునీల్‌కుమార్‌కు ప్రజలు హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో డి.మధు సూదన్ రెడ్డి, పి.భాస్కర్‌రెడ్డి, పి.పురుషోత్తంరెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, పంత్రంగం అరుణ్, పి.వసంత్, కుంచెం దయాకర్, టి.శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి, శ్రీహరి, అయోధ్య బాలచంద్రయ్యశెట్టి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, గౌస్‌మొహీద్దీన్, రౌతు శివకుమార్, కళవల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజన్‌గల నాయకుడు చంద్రబాబు

గూడూరు, మే 7: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు బంగారు భవిష్యత్తు ఉండాలన్నా విజన్ గల నాయకుడు చంద్రబాబు అధికారంలోకి రావాలని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక 1వ వార్డు, మసీదువీధి, మాళవ్యానగర్ ప్రాంతాలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువత, ఉద్యోగులు, బడుగుబలహీన వర్గాల ప్రజలు ఎంతో అవస్థలుపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ గద్దెదించి ఉమ్మడి కూటమిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చెంచురామయ్య, గురవయ్య, మస్తాన్‌నాయుడు, రవీంద్రరెడ్డి, రమేష్, ప్రణీత్, సుబ్బయ్య, సందీప్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.


గూడూరులో ప్రచారం నిర్వహిస్తున్న పాశం సునీల్‌కుమార్ తనయుడు జశ్వంత్‌కుమార్